నిర్భయవార్త తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.com
http://nirbhayavaartha.com

# నిర్భయవార్త

తెలుగు దినపత్రిక

NIRBHAYA VARTHA TELUGU DAILY



విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్న "నిర్భయవార్త" తెలుగు దినపత్రికకు జర్నలిజంపై ఆసక్తి కలిగి, అన్ని జిల్లాల నుండి బ్యూరో ఇన్‌చార్జ్‌లు, స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్‌సి ఇంచార్జీలు మండలాల వారిగా విలేకరులు కావలెను.

సంప్రదించండి

సెల్ : 7799013939



సంపుటి :12 సంచిక :313 రంగారెడ్డి | ఆదివారం 08 మార్చి 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00

Circulated To : ★ Hyderabad ★ Ranga Reddy ★ Nizamabad ★ Warangal ★ Mulugu ★ Shadnagar ★ Yadadri ★ Nalgonda ★ Karimnagar ★ Khammam ★ Medak ★ Sangareddy ★ Siddipet ★ Medchal ★ Jagityal ★ Vemulawada





## సోషల్ మీడియా వల్లే

# మహిళలపై వేధింపులు

**అతివల భద్రత కోసం చేసిన చట్టాలు అమలు కావాలి**

**ప్రజా ప్రభుత్వంలో మహిళలకు అధిక ప్రాధాన్యం**

**ఉచిత బస్సు, స్వయం సహాయక సంఘాలకు చేయూత**

**సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు,**

**హైర్ బస్సులు అన్నింటికీ యజమానులను చేస్తున్నం**

**స్టాండ్ విత్ హర్ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, మార్చి 7 నిర్భయవార్త ప్రతినిధి :మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. శనివారం జేఎన్ టీయూలో స్టాండ్ విత్ హర్ కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 'స్టాండ్ విత్ హర్' బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనం తరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మహిళా దినోత్సవం జరుపుకుంటేనే బాధ్యత తీరిపోయినట్టు కాదన్నారు. మహిళా నాయకత్వం నుంచి వచ్చిన పార్టీ ద్వారా రాష్ట్రంలో ప్రభు త్వాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.

**మహిళల పట్ల బాధ్యతల్ని నెరవేర్చాలి**

మహిళలను శక్తితో పోలుస్తామని.. కుటుంబ గౌరవాన్ని కూడా మహిళలతో పోలుస్తామని సీఎం తెలిపారు. మహిళలకు వేధింపులు.. పట్టణాలు, కాలేజీలు, పబ్లిక్ ప్రాంతాలకు మాత్రమే పరిమితం కాలేదని.. సోషల్ మీడియాలో మహిళలు ఎక్కువగా వేధింపులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. 'మనల్ని మనం సవరించుకొని మహిళల పట్ల మన బాధ్యతల్ని నెరవేర్చాలి' అని సీఎం సూచించారు.

మహిళలకు ఆర్థిక స్వావలంబన.. మహిళల రక్షణ కోసం చట్టాలు చేస్తే బాధ్యత తీరిపోయిందని అనుకోవడం తప్పని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల కేటాయింపులు, రేషన్ కార్డులు అన్నీ మహిళల పేర్లమీద ఇస్తోందన్నారు. తెలంగాణలో స్వయం సహాయక సంఘాల మహిళలకు సోలార్ పవర్ ఉత్పత్తి చేసి విద్యుత్ శాఖకు అమ్మే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. ఈ నిర్ణయంతో మహిళలు అదానీ, అంబానీల స్థాయిలో విద్యుత్ రంగంలో పోటీ పడే అవకాశం ఇచ్చామన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం పలు అవకాశాలు కల్పిస్తోందని సీఎం రేవంత్ వెల్లడించారు.

మహిళల శక్తిపై సంపూర్ణ విశ్వాసం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం ద్వారా వారి స్వేచ్ఛ పెరిగిందని సీఎం తెలిపారు. జిల్లాల్లో ప్రభుత్వ స్థలాలు కేటాయించి మహిళల చేతుల్లో పెట్రోల్ బంకులు నిర్వహించే అవకాశాలు ఇచ్చామన్నారు. దేశంలోనే తొలిసారి మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టింది తెలంగాణ ప్రభుత్వమని చెప్పారు. రాష్ట్రంలో చీఫ్ సెక్రటరీ సహా కీలక అధికార పదవుల్లో మహిళలకు అవకాశాలు కల్పిస్తున్న ప్రభుత్వం తమదే అని అన్నారు. మహిళల శక్తి, నైపుణ్యంపై ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉందని స్పష్టం చేశారు. తెలంగాణను దేశంలోనే మహిళలకు అత్యంత భద్రత కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

సైబర్ నేరాలపై కఠిన చర్యలు

మహిళల రక్షణను సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సీఎం రేవంత్ అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబం, రాష్ట్రం, దేశం బలపడుతుందన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలు సైంటిస్టులు, డాక్టర్లు, ఇంజనీర్లుగా రాణిస్తున్నారని తెలిపారు. మహిళలు ధైర్యంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ఎక్కడైనా మహిళలపై వేధింపులు జరిగితే నిలబడి ప్రశ్నించే ధైర్యం సమాజంలో రావాలన్నారు. కాలేజీలు, బస్టాండ్లు సహా ఎక్కడైనా జరిగే వేధింపులను చూసీ చూడనట్టు ఉండడం కూడా నేరాన్ని ప్రోత్సహించడమే అని అన్నారు. సోషల్ మీడియా ద్వారా మహిళలపై సైబర్ వేధింపులు పెరుగుతున్నాయని తెలిపారు. మహిళలపై మార్ఫింగ్, ఫేక్ వీడియోలు వంటి సైబర్ నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

## లొంగిపోయిన 130 మంది మావోయిస్టులు..



హైదరాబాద్, మార్చి 7 నిర్భయవార్త ప్రతినిధి : తెలంగాణలో మావోయిస్టుల లొంగుబాటు పరంపర కొనసాగుతోంది. ఇప్పటి వరకు తెలంగాణ పోలీసులు ముందు 721 మంది మావోయిస్టులు లొంగిపోయారు. మావోయిస్టుల నుంచి పోలీసులు ఇప్పటి వరకు 266 ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి 7 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట 130 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ కమిటీ మొత్తం సరెండర్ అయిపోయింది. మావోయిస్టులు తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. 124 తుపాకులు, 5205 తూటాలతో సహా మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసి పోయారు. మావోయిస్టులు సరెండర్ చేసిన ఆయుధాలలో INSAS LMG రైఫిల్ ఒకటి, AK-47 రైఫిళ్లు 31, INSAS రైఫిళ్లు 21, SLR రైఫిళ్లు 20, 303 రైఫిళ్ల18, 33 ఇతర తుపాకులు ఉన్నాయి. లొంగిపోయిన వారిలో దేవ్‌జీ, బడే చొక్కారావు గన్‌మెన్లు కూడా ఉన్నారు. ఇక, లొంగిపోయిన వారికి తెలంగాణ ప్రభుత్వం నగదు బహుమతి ఇస్తోంది. తెలంగాణ ప్రభుత్వం జనజీవన స్రవంతిలో కలిసిపోయిన డివిజనల్ కమిటీ సభ్యుల(ఐఎజవీ)కు ఐదు లక్షల రూపాయలు, ఏరియా కమిటీ సభ్యులకు నాలుగు లక్షల రూపాయలు, పార్టీ సభ్యులకు లక్ష రూపాయలు నగదు బహుమతి ప్రకటించింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం ఆయుధాలతో సహా జనజీవన స్రవంతిలో కలుస్తున్న క్యాడర్లకు అదనంగా ప్రోత్సాహకాలు అందనున్నాయి.

## కాళేశ్వరం కూలిందని చిల్లర మాటలు మాట్లాడుతారా ..

### రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు ధ్వజం



కరీంనగర్, మార్చి 7 నిర్భయవార్త ప్రతినిధి : తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు ఇచ్చే తెలివి లేదా అని ప్రశ్నించారు. మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలని గతంలో ఆయన చెప్పారని.. కానీ ఇప్పుడు తన హయాంలో మూడు పంటలకు రైతుబంధు ఎగొట్టారని ధ్వజమెత్తారు. శనివారం కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి నియోజకవర్గం గోపాలరావుపల్లిలో హరీశ్‌రావు పర్యటించారు. గోపాలరావుపల్లిలో పంట పొలాలను పరిశీలించారు. సాగునీరు లేక అన్నదాతలు పడుతున్న కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖిలో ఆయన మాట్లాడారు.

రైతుల దగ్గరకు ఎలా పోతారు..?

కాంగ్రెస్ నేతలు ఏ మొహం పెట్టుకుని రైతుల దగ్గరకు పోతారు....? అని హరీశ్‌రావు నిలదీశారు. పోలీసులు లేకుండా జనం దగ్గరకు ఎమ్మెల్యేలు, మంత్రులు వెళ్లగలరా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందని కాంగ్రెస్ నేతలు చిల్లర మాటలు మాట్లాడుతారా..? అని ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్లే పంటలు పండుతున్నాయని స్పష్టం చేశారు. హైదరాబాద్‌కు తాగునీటిని అందించేది కాళేశ్వరం నీళ్లేతోనేనని తేల్చిచెప్పారు. తమపై చిల్లర వ్యాఖ్యలను బంద్ చేయాలని.. లేకపోతే తాము ఊరుకోమని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందని అడ్డగోలు ఆరోపణలు చేస్తారా..? అని ఆగ్రహించారు. ఈ ప్రాజెక్టును ఎండబెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ పిల్లర్లను రేవంత్‌రెడ్డి సర్కార్ వెంటనే రిపేర్ చేయాలని డిమాండ్ చేశారు. రెండేళ్లలో కనీసం పది వేల ఎకరాలకు నీరిచ్చారా....? అని హరీశ్‌రావు ప్రశ్నల వర్షం కురిపించారు.

## చమురు కొనేందుకు ఏ దేశం

# అనుమతి అవసరం లేదు..

### రష్యా నుంచి చమురు కొనుగోలుపై భారత్

ఢిల్లీ, నిర్భయవార్త : రష్యా నుంచి తాము చమురు కొనేందుకు ఏ దేశం అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని భారత్ స్పష్టం చేసింది. ఇప్పటికీ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు తాజాగా ఒక ప్రకటన చేసింది. ఇటీవల అమెరికాతో ఇండియాకు ట్రేడ్ డీల్ కుదిరిన నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోలును ఆపేయాలని అమెరికా చెప్పిందని, దీనికి ఇండియా కూడా అంగీకరించిందని ప్రచారం జరిగింది. ఇదే సమయంలో రష్యా నుంచి చమురు కొనుగోళు తగ్గినట్లు పలు నివేదికలు తెలిపాయి. ప్రస్తుతం ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ఇండియాకు హోర్ముజ్ జలసంధి నుంచి చమురు సరఫరా ఆగిపోయింది. దీంతో మన అవసరాల కోసం నెల రోజులపాటు రష్యా నుంచి ఆయిల్ కొనేందుకు పర్మిషన్ ఇచ్చామని అమెరికా ప్రకటించింది. కాగా.. మన దేశం చమురు కొనేందుకు అమెరికా అనుమతి కావాలా అంటూ ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ఈ విషయంలో కేంద్ర వైఖరిని తప్పుబడుతున్నాయి. కానీ, దీనిపై కేంద్రం స్పందించింది. ఆయిల్ కొనేందుకు ఇండియాకు ఎవరి అనుమతి అవసరం లేదని స్పష్టం చేసింది. దేశ ప్రయోజనాలే ముఖ్యమని, ఎవరు తక్కువ ధరకు చమురు అమ్మితే వారి నుంచి కొనుగోలు చేస్తామని తెలిపింది. దీనిపై కేంద్రం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది.




కేంద్ర ప్రకటన ప్రకారం.. ఇండియా ఆయిల్ కోసం ఏ ఒక్క దేశంపైనో, మార్గంపైనే ఆధారపడట్లేదు. 27-40 దేశాల నుంచి ఆయిల్ కొంటోంది. రష్యా నుంచి ఫిబ్రవరిలో కూడా ఆయిల్ దిగుమతి చేసుకుంది. ఇప్పటికీ ఇండియాకు రష్యా అతిపెద్ద చమురు సరఫరాదారుగా ఉంది. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో అమెరికా, యురోపియన్ యూనియన్ అభ్యంతరాలున్నప్పటికీ మూడేళ్లుగా రష్యా నుంచి ఇండియా చమురు దిగుమతి చేసుకుంటూనే ఉంది. ఇండియాకు తగ్గింపు ధరలకే రష్యా ఆయిల్ అందిస్తుండటంతో, దేశంలో డిమాండ్‌కు తగ్గట్లు ఆయిల్ కొంటుంది. రష్యా నుంచి ఆయిల్ కొనేందుకు అమెరికా పర్మిషన్ ఇచ్చినట్లు చెప్పుకొంటున్నప్పటికీ.. దీంతో సంబంధం లేకుండా ఇప్పటికీ రష్యా ఆయిల్‌ను ఇండియా తీసుకుంటోంది. ప్రస్తుత సంక్షోభం ఉన్నప్పటికీ ఇండియా వద్ద 250 మిలియన్ బ్యారెళ్ల క్రూడాయిల్ ఉంది. ఇదంతా కలిపి ఏడు నుంచి ఎనిమిది వారాలపాటు దేశీయ అవసరాలకు సరిపోతుంది. ఇండియా సంవత్సరానికి 258 మిలియన్ మెట్రిక్ టన్నుల చమురును శుద్ధి చేయగల సామర్థ్యం కలిగి ఉంది. ఇది ప్రస్తుత దేశీయ అవసరాలకంటే ఎక్కువే. మరోవైపు ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరుగుతున్నాయి. శుక్రవారం నాటికి 8.5 శాతం ధరలు పెరిగినట్లు అంచనా. ఈ యుద్ధం ఇంకా ఇలాగే కొనసాగితే ధరలు ఇంకా పెరగొచ్చు.

## హోలీ రంగుల ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం..

### నలుగురు మహిళల దుర్మరణం



హర్యానా, నిర్భయవార్త : హర్యానాలోని ఒక హోలీ రంగుల తయారీ కర్మాగారంలో తాజాగా అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నలుగురు మహిళా కార్మికులు మరణించగా 20 మంది గాయాలపాలయ్యారు. జింద్ జిల్లాలోని సఫిడాన్ నగరంలోగల భట్ కాలనీలో ఈ ప్రమాదం జరిగింది. అకస్మాత్తుగా చెలరేగిన మంటలు నిమిషాల వ్యవధిలోనే కర్మాగారం అంతా వ్యాపించాయి. దట్టమైన పొగ కమ్మేసింది. అసలేం జరిగిందో అర్థం కాక కార్మికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం కర్మాగారానికి బయటి నుంచి లాక్ వేసి ఉండటంతో కార్మికులు అక్కడి నుంచి బయటపడలేక ఇబ్బంది పడ్డారట. కొందరు ఫ్యాక్టరీలోనే చిక్కుకుపోయినట్టు తెలిసింది. ఇక ప్రమాద సమాచారం అందగానే ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది క్షతగాత్రులను రక్షించారు. వారిని సమీపంలోని సివిల్ ఆసుపత్రికి తరలించారు. కాగా, ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

నిర్భయవార్త
సంపాదకీయం
ఆదివారం 08, మార్చి 2026

# స్వాహా..

బిజెపి ఏ ప్రాంతీయ పార్టీతో చెలిమి చేసినా దాన్ని మింగేయడం ఖాయమని బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ గురువారం రాజ్యసభకు నామినేషన్ వెయ్యడంతో మరోసారి రుజువయ్యింది. త్వరలోనే నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడం, ఆ వెనువెంటనే బిజెపి నేత సిఎం కావడం జరుగుతుంది. త్వరలో బీహార్‌లో ఏర్పడబోయే నూతన ప్రభుత్వానికి తన సహకారం ఉంటుందని నామినేషన్‌కు ముందు సామాజిక మాధ్యమాల్లో నితీశ్ ప్రకటనలోనే ఈ విషయం విదితమయ్యింది. శాసనసభ, శాసన మండలి, లోక్‌సభ సభ్యునిగానే పనిచేశాననీ రాజ్యసభకు కూడా సభ్యునిగా సేవలందించాలనేది తన ఆకాంక్ష అని ఆయన చెప్పుకొచ్చారు. తీవ్రమైన పోటీలో గెలిచి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాలుగు నెలలకే రాజ్యసభ సభ్యత్వం మీద అంత మక్కువ ఎందుకు కలిగిందో అందరికీ తెలిసిందే! అసెంబ్లీ ఎన్నికల అనంతరం 89 సీట్లు గెలిచిన బిజెపి 85 సీట్లు పొందిన జెడి(యు)కు ముఖ్యమంత్రి పదవి ఇచ్చిననాడే ఈ పరిణామాన్ని విశ్లేషకులు ఊహించారు. 'మేం ముందునుంచే చెప్పాం. నితీశ్ ఆరు నెలలకంటే ఎక్కువ కాలం ఆ పదవిలో ఉండరన్నాం. అంతేకాదు, బిజెపి ఎవరితో పొత్తు పెట్టుకున్నా.. వారిని నాశనం చేసిన చరిత్ర ఉంది. ఒబిసిలు, దళితులు, గిరిజనులకు అనుకూలంగా నిలిచే నాయకత్వాన్ని బిజెపి కోరుకోవడం లేదు. నితీశ్ కుమార్‌ను కేంద్ర రాజకీయాలకు పంపడం బీహార్ ప్రజల తీర్పునకు విరుద్ధం' అన్న బీహార్ ప్రతిపక్ష నేత తేజస్వీ వ్యాఖ్యలను ఎవరూ కాదనలేరు.

ఇంతకుముందు మహారాష్ట్రలో మాదిరిగానే ఇప్పుడు బీహార్‌లో జరిగింది. శివసేన పార్టీతో బిజెపి చెలిమి చేసి ఆ పార్టీని చీల్చి, ఒక ముక్కను అక్కున చేర్చుకొని అప్పటికి ముఖ్యమంత్రి పదవినిచ్చి ఎన్నికలయ్యాక కమలనాథుడ్ని గద్దెనెక్కించారు. మహారాష్ట్రలో మరో ప్రధాన పార్టీగావున్న ఎన్‌సిపిని అలాగే చేశారు. అంతకుముందు గోవాలో ఎంజిపిని మింగేశారు. ఒడిషాలో బిజెడిని బుజ్జగిస్తూనే ఆ పార్టీని కూడా కరి మింగిన వెలగ పండు చందం గావించారు. ఏ రాష్ట్రంలోనైనా కమలం పార్టీ తీరు అదే! ఒకే దేశం... ఒకే పార్టీ... ఒకే నేత సిద్ధాంతం గల బిజెపికి ప్రాంతీయ పార్టీల పొడ గిట్టదు. సైద్ధాంతికంగానే ఆ పార్టీ అందుకు వ్యతిరేకం. కేంద్రీకరణ వారి విధానం కనుకనే రాష్ట్రాల హక్కుల్ని ఒక్కొక్కటిగా హరిస్తూ వస్తున్నారు. వాటికి చట్టబద్ధంగా ఇవ్వాల్సిన నిధులను సైతం బిగబడుతున్నారు. ప్రజాస్వామ్యం పట్ల కూడా బిజెపికి నిబద్ధత కరువే. అటువంటి పార్టీతో చెలిమి చేసినవారు నష్టపోక తప్పదన్నది చరిత్ర చెప్పిన సత్యం. కేవలం నష్టపోవడమే కాదు క్రమంగా అంతరించిపోయే పరిస్థితి కూడా ఏర్పడుతుంది. అటువంటి భయం తోనే అకాలీదళ్ వంటి పార్టీలు జాగ్రత్త పడినట్టు కనిపిస్తుంది.తెలుగు రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలు బిజెపి పంచన చేరడం ద్వారా తెలుగు ప్రజలకు తీరని హాని కలిగిస్తున్నాయి. విభజన చట్టం ద్వారా కల్పించవలసిన ప్రత్యేక హోదా ఎగ్గొట్టడమేగాక ఇతర హామీలనూ విస్మరించిన బిజెపితో ప్రత్యక్ష లేదా పరోక్ష నెయ్యం నెరపడం ద్రోహపూరిత చర్య. అసెంబ్లీలోనూ బయటా ఒకరిపై ఇంకొకరు కత్తులు దూసుకునేలా వ్యవహరించే టిడిపి వైసిపిలు బిజెపి విషయంలో మాత్రం ఏకాభిప్రాయమే ప్రదర్శించడం పచ్చి అవకాశవాదమే కదా! గతంలో రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఏకోన్ముఖంగా బిజెపి అభ్యర్థులకు ఓటు వేయడం, కేంద్రం తెచ్చిన దాదాపు అన్ని బిల్లులనూ ఇరు పార్టీలూ సమర్థించడం దారుణం. తమను తాము లౌకిక పార్టీలుగా చెప్పుకొంటూ మతతత్వ బిజెపితో చెలిమి చేయడం ప్రజలను మోసగించడమే. 2024 ఎన్నికల్లో సొంతంగా మెజార్టీ పొందలేని బిజెపి ప్రభుత్వం మనగలగడానికి ఆక్సిజన్ అందిస్తున్న టిడిపి ఇప్పటికైనా పునరాలోచించాలి. కేంద్ర, బడ్జెట్‌లో రాష్ట్రానికి తగిన కేటాయింపుల్లేవు. కేంద్రం నుండి గ్రాంట్లు సైతం ఏడాదికేడాది తగ్గిపోతూ వస్తున్నాయని శుక్రవారంనాడు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన కాగ్ నివేదిక కూడా పేర్కొంది. రాష్ట్రానికి తీవ్రమైన చేటు చేస్తున్న బిజెపితో చెలిమి విషయాన్ని టిడిపి సమీక్షించుకొని ధృతరాష్ట్ర కౌగిలిని వదిలించుకోవడం విజ్ఞతగా వుంటుంది. లేదా జెడి(యు) మాదిరి కావడానికి సన్నద్ధమైపోవాలి! తస్మాత్ జాగ్రత్త!

# అసందర్భ సందర్శన, అమానుష దురాక్రమణ




ప్రధానమంత్రి మోడీ ఇజ్రాయిల్ సందర్శన చాలా పొరబాటు ఆలోచన అనీ, ఎంచుకున్న సమయం కూడా ఏ మాత్రం సరైంది కాదనీ ఇప్పుడు సుస్పష్టమైపోయింది. కేవలం నైతిక సమస్య పరిధిని మించి భౌగోళిక రాజకీయాలు, జాతీయ వ్యూహంపై ప్రభావం చూపించింది. గాజాలో జాతి హత్యాకాండ రాక్షసత్వం కొనసాగుతూనే వుంది. తుడిచిపెట్టేందుకు ప్రారంభించిన పాలస్తీనా ప్రజానీకాన్ని, భూఖండాన్ని చుట్టుముట్టిన విధ్వంసం అవశేషాలు ఇంకా పూర్తిగా తొలగించబడనే లేదు. దానికి తోడు పశ్చిమ తీరంలో ఇజ్రాయిల్ నిర్మాణ సముదాయాల విస్తరణ వేగంగా సాగిపోతున్నది. ఇదంతా పాలస్తీనా సమస్యకు ఇరుదేశాల స్థాపనతో కూడిన పరిష్కారం జరగకుండా దెబ్బతీస్తున్నది.కాల్పుల విరమణ ఒప్పందం పై సంతకాలు జరిగినా హత్యాకాండ ఆందోళనకరమైన స్థాయిలో జరిగిపోతున్నదని ప్రపంచం గుర్తిస్తున్నది. ట్రంప్ ఏర్పాటు చేసిన శాంతి బోర్డుకు సాధారణ పరిస్థితి నెలకొల్పాలనే ఉద్దేశంగానీ ఆ శక్తిగానీ లేవు. అసలు దాని ఏర్పాటే ఐక్యరాజ్యసమితి వ్యవస్థ మూలాలను దెబ్బ తీసేందుకు ఉద్దేశించింది. డోనాల్డ్ ట్రంప్ చైర్మన్‌గా వుండటం ఒకటైతే–ఈ మొత్తం ప్రక్రియను ముందుకు తీసుకుపోవడానికి సారథ్యం ఇరాక్ దురాక్రమణ సమయంలో అత్యంత అసహ్యకర పాత్ర పోషించిన టోనీ బ్లెయిర్‌కు అప్పగించడం నైతికతనే సవాలు చేసింది. పశ్చిమాసియాలో భారత దేశ వ్యూహాత్మక ప్రయోజనాలకు కావలసినంత రక్షణ వుంది. గల్ఫ్‌లోని అనేక దేశాలతో, ఇరాన్‌తో భారతీయ నాగరిక పౌర సంబంధాలు చరిత్ర క్రమంలో నిక్షిప్తమై వున్నాయి. ఆధునిక కాలంలోనైతే ఈ ప్రాంతంలోని అనేక దేశాలలో భారతీయ వలస కార్మికులు భారీ సంఖ్యలో వుండటం ఇప్పటి విషయం. పశ్చిమాసియాలోని వారి నుంచి వచ్చే చెల్లింపులు అనేక రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలలో ఎంతగానో కీలక పాత్ర వహిస్తున్నాయి. అంతేగాక మన చమురు సరఫరాలలో అధిక భాగం హార్మోజ్ జలసంధి ద్వారానే రవాణా అవుతాయి. అగ్రగామిగా ఇరాన్–ఇజ్రాయిల్‌లో మోడీగాజా జాతి హత్యాకాండ సమయం నుంచి యూదు జాత్యహంకార ఇజ్రాయిల్ నిర్వాకాలు అరబ్ దేశాల వీధులలో ఆవేశం కుమ్మరిస్తూ వచ్చాయి. ఇజ్రాయిల్ పట్ల పెరిగిన వ్యతిరేకత గల్ఫ్ దేశాలలో, పశ్చిమాసియా ప్రభుత్వాలలో ఎంత ప్రభావం చూపిందంటే అబ్రహం ఒప్పందాలన్నీ నిలిపివేయబడ్డాయి. ఈ ప్రతిఘటనలకు నాయకత్వం వహిస్తున్నది ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ అన్నది నిస్సందేహం. ఈ నేపథ్యంలో ఇజ్రాయిల్‌తో మోడీ చెట్టపట్టాల్ కట్టడం కన్నా దారుణమైన దృశ్యం మరొకటి వుండదు. గాజాలో మారణకాండ మృతుల గురించి నోరెత్తకుండా మారణహోమం మృతులకు సంస్మరణ కార్యక్రమంలో మోడీ పాల్గొనడం కొట్టొచ్చినట్టు కనిపించింది. ఆ జాతి హత్యాకాండతో విభేదించే భారతదేశ విధానాన్ని ప్రధానమంత్రి మోడీ తలకిందులుగా మార్చేశారని చెప్పాలి. ప్రపంచంలోనేగాక ఇజ్రాయిల్‌లో కూడా విశ్వాసం నిలబెట్టుకోవడానికి విన్యాసాలు చేస్తున్న నెతన్యాహుకు ఆమోద ముద్ర వేయడంలో దౌత్యపరమైన ప్రాథమిక సూత్రాలు కూడా కనిపించవు. ఇది భారతదేశం అనుసరిస్తూ వస్తున్న సూత్రబద్ధమైన సామ్రాజ్యవాద వ్యతిరేక అలీన విధానాలను కూడా కుప్పకూల్చింది ఇజ్రాయిల్ పార్లమెంటు నెస్సెట్‌లో మోడీ ప్రసంగాన్ని మొత్తం ప్రతిపక్షం బహిష్కరించడం దీనికే నిదర్శనం. అంతేగాక ఇండియా, అమెరికా, ఇజ్రాయిల్‌తో కూడిన షణ్ముఖ కూటమిని నెతన్యాహు ముందుకు తేవడం కూడా మరో తీవ్ర ఆందోళనకు కారణమవుతున్నది. భారతదేశ భద్రతా సైనిక కొనుగోళ్లలో పెద్ద భాగం ఇజ్రాయిల్ నుంచే జరుగుతుందని చెప్పే సంకేతమది. దీనికీ భారతదేశ వ్యూహాత్మక స్వతంత్రంతోగానీ, జాతీయ ప్రయోజనాలతో గానీ ఏమాత్రం సంబంధం లేదు. కేవలం అమెరికా ప్రపంచాధిపత్య వ్యూహంలో భాగంగా జరిగిందే...అన్న వాస్తవాన్ని పథకం ప్రకారం సాగిన ఈ చెట్టపట్టాల తతంగం ఏ మాత్రం దాచిపెట్టలేకపోయింది.ఇరాన్‌పైన దాడి చేయడానికి అమెరికా, ఇజ్రాయిల్ సంసిద్ధంగా వున్న విషయం తెలియదని చెప్పడం భారతదేశ రాజకీయ నిఘా యంత్రాంగం అమాయకత్వమే. ఇరాన్ వరకూ చూస్తే గాజా జాతి హత్యాకాండకు పాల్పడిన ఇజ్రాయిల్ దుండగీడుతనాన్ని ప్రతిఘటించడంలో ఆ ప్రాంతానికి అగ్రభాగాన నిలబడింది. చైనాకు, రష్యాకు ఇరాన్ మరింత సన్నిహితం కావడం కూడా ఇజ్రాయిల్ అమెరికాల రాజకీయ, భౌగోళిక వ్యూహాలకు ప్రధాన ప్రతిబంధకమైంది. ఆ కారణంగానే ఇరాన్ వారి దాడికి లక్ష్యంగా మారుతున్నట్టు స్పష్టమైపోయింది. అమెరికా బూటకత్వంఅమెరికా విదేశాంగ విధాన బూటకత్వాన్ని ప్రపంచం ప్రత్యక్షంగా చూసింది. ఎప్పటికంటే ఇప్పుడది మరింత ఎక్కువగా బయటపడిపోయింది. పెట్టుబడిదారీ విధానానికి వంత పాడే అనేక మంది సమకాలీన వ్యాఖ్యాతలు లెనిన్ సిద్ధాంతాలకు కాలం చెల్లిందని ప్రకటించడానికి ఆదుర్దాపడి పోతుంటారు. కానీ యుద్ధం, పెట్టుబడిదారీ విధానం అనేవి అవిభాజ్య కవలల వంటివని ఆయన నొక్కి చెప్పిన సిద్ధాంతం ఎంతగానో సజీవంగా శక్తివంతంగా వినిపిస్తుంది. యూదు జాత్యంహంకారంతో కూడిన అఖండ మహా ఇజ్రాయిల్ పథకానికి ఇరాన్ నుంచి వస్తున్న ప్రతిఘటనను నిర్వీర్యం చేయాలంటూ అధ్యక్షుడు ట్రంప్‌ను ఇజ్రాయిల్ పురికొల్పింది. అదే సమయంలో ఈ ప్రాంతంలో తమ తిరుగులేని ఆధిపత్యాన్ని నెలకొల్పుకోడానికి, రష్యా చైనా ప్రభావం పెరక్కుండా అడ్డుకోవడానికిగాను ఇరాన్ పాలక వ్యవస్థను మార్చాలని ట్రంప్ పాలన వ్యవస్థ కూడా తలపోసింది.ట్రంప్ ఏదో శాంతికాముక అధ్యక్షుడనేది ఒక బూటకం మాత్రమే. ఇరాన్ అణు కార్యక్రమం గురించి పదేపదే మాట్లాడటం మొదటి నుంచీ మోసపూరితమే. ఇజ్రాయిల్‌కు రహస్య అణ్వస్త్ర సామర్థ్యం వుందనేది బహిరంగ రహస్యం అయినా ఎవరూ దాని గురించి పెదవి మెదపరు. మరోవైపున ఇరాన్ తాము అణ్వాయుధం చేయడం లేదని తేటతెల్లంగా ప్రకటించింది. పర్యవేక్షకులకు ఆ ప్రదేశాల సందర్శనను అనుమతించింది. అయితే అక్కడ పారదర్శకత ప్రమాణాలపై అంతర్జాతీయ అణు సంస్థ (ఐ.ఎ.ఇ.ఎ) చౌరబాటుదారీ రాజకీయ దురుద్దేశాలతో ప్రకటన చేసిన తర్వాతనే ప్రతిష్టంభన ఉత్పన్నమైంది.దుష్ట పథకం అదే అంతేగాక 2025లో ఇరాన్ అణు ప్రదేశాలపై భారీ ఎత్తున బాంబు దాడులు జరిగాయి. వాటిని ధ్వంసం చేశామనీ ఇక సమీప భవిష్యత్తులో ఉత్పత్తి చేయగల స్థితిలో లేవని ట్రంప్ ప్రకటించారు. ఇరాన్ కూడా ఓమన్ మధ్యవర్తిత్వంలో దౌత్యపరమైన సంప్రదింపులు మొదలుపెట్టింది. అయితే అది వారు గల్ఫ్‌లో సైనిక బలం పోగేసుకోవడానికీ, అమెరికా వైమానిక బాంబు దాడి సంపత్తిని ఇరాన్ పైకి మోహరించడానికి ఒక వంచనాత్మక ఎత్తుగడ మాత్రమే. ఇప్పుడు అమెరికా, ఇజ్రాయిల్ రెండూ కలసికట్టుగా దాడి చేయడాన్ని బట్టి చూస్తే ఇది ఖచ్చితంగా పథకం ప్రకారమే జరిగిందని తెలిసిపోతుంది. ఇరాన్ తన ఆయుధ నిల్వలను గణనీయంగా తగ్గించుకుని దౌత్య పరమైన పరిష్కారం కోసం చేసిన ప్రయత్నాలను అందుకే తిరస్కరించారు. ఇప్పుడు ఎప్పుడూ కూడా అణుబాంబు చేయబోమని చెప్పినట్టు ఒమన్ విదేశాంగ మంత్రి ద్వారా బహిరంగంగానే ప్రకటించారు కూడా. అయినా వారు తిరస్కరించారు.ఈ మొత్తం పరిణామ క్రమం మోడీ ఇండియాకు తిరిగివచ్చిన 48 గంటలలోనే జరిగింది. మొత్తం ఘటనల క్రమం బట్టి చూస్తే ఈ సైనిక దుస్సాహసంలో ఇండియా దాదాపు భాగంగా కనిపిస్తుంది. అమెరికా ఏ విధమైన లెక్కలు వేసుకున్నా అవన్నీ తప్పిపోయాయి. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలన్నిటిపై ఇరాన్ ప్రతీకార దాడులు ప్రారంభించింది. టెల్ అవీవ్‌తో సహా ఇజ్రాయిల్ నగరాలనేక వాటిపై ఇరాన్ మిసైల్ దాడులు మరింత తీవ్రంగా సాగుతున్నాయి. అనివార్య ప్రతిఘటన ఇరాన్ ప్రతీకార చర్యలను పిరికితనంగా అమెరికా, దాని మిత్రులు అభివర్ణించడం విడ్డూరంగా కనిపిస్తుంది. అమెరికా ఇజ్రాయిల్ ఉమ్మడిగా జరిపిన దురాక్రమణ కావాలని చేసింది. వేరువేరుగా కనిపిస్తూ కలిసి చేసిన దురాక్రమణలో అలీ ఖమేనీతో సహా తమ నాయకత్వంలో ప్రముఖమైన వారిని హత్యగావించిన తర్వాత కేవలం తన మనుగడ కోసం వార్యంగా చేస్తున్నది ఇరాన్ ప్రతిఘటన.ఇరాన్‌కు గల వికేంద్రీకృతమైన, బహుళ దొంతరలతో కూడిన ప్రత్యామ్నాయ నాయకత్వ వ్యవస్థలను, సైనిక సంఘర్షణ ఏర్పాట్లు బాగా తెలిసినవే. అది వాటిని స్పష్టంగా ప్రదర్శించడమేగాక ఇప్పుడు క్రియాశీలం చేసింది. ఇరాన్ హార్మోజ్ జలసంధిని మూసివేయడంతో భారత దేశ విదేశాంగ విధానం మాత్రం స్వీయ పరాజయ కారకంగా మారింది. భారతీయ ఇంధన సరఫరాలలో అత్యధిక భాగం దాని ద్వారానే చేరాల్సి వుండగా ఈ నిర్ణయం చమురు ధరలు ఉన్నఫళాన పెరిగిపోవడానికి కారణమైంది.తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కున్న అవివేకి గురించి కాళిదాసు జానపద కథలో చూస్తాం. ఇజ్రాయిల్‌తో చెట్టపట్టాల తతంగం భారత విదేశాంగ విధానాన్ని అమెరికా వ్యూహాత్మక పథకాలకు ఉపాంగంగా మార్చివేసింది. దక్షిణాది దేశాలకు నాయకత్వం వహిస్తున్నట్టు భారత దేశం పదేపదే చెప్పుకున్న గొప్పలను పటాపంచలు చేసింది. ఈ సైనిక ఘర్షణలు అంతం కావాలనీ, శాంతి పునరుద్ధరణ కావాలని మనం సమిష్టి స్వరం వినిపించాల్సి వుంది.

# కొత్త నేస్తరికం!

మోకాళ్ళ పైకి మడుచుకున్న పొందూరు ఎర్రజీరల పంచె.. పులి చర్మంలాగా.. పిడికడంత పులిగోరు గొలుసు, కాలసర్పం లాగా.. నుదుట విభూతి, కాశీ శవ భస్మం లాగా... తెల్ల గ్రానైట్ మెట్లు మీద నుంచి తమరు దిగుతుంటే, మంచు పలకల మీద నడిచి వస్తున్న ఆ మహా శివుడే దిగి వస్తున్నట్టు అనిపించింది నాయుడు గారూ!"విజయనగరం నుంచి వచ్చిన బుస్సీ నాయుడు ముందు హాల్లో.. కుర్చీలోంచి లేచి, చేతులు జోడించి, పరమ వినయంగా నడుం వంచి ప్రస్తుతించాడు. దశుమంతు నాయుడు కూడా, ఉబ్బులింగడు. సరదా పడిపోయాడా మాటలకి!"ఇజానగరమంటేనే ఇద్యల నగరం.. కోవా నుంచి గోవా వరకు ఏదైనా వొర్ణించగలరు!"– పరదేశికి, బుస్సీ పరిచయం ఇష్టం లేదు. పార్టీ ఫిరాయించినా, టికెట్ రాని మాజీ ఎమ్మెల్యే లాగా మొహం మాడిపోయింది. "ఏళగాని ఏళా! సాయింత్రం వచ్చినారేటి?" పొగడ్తల పొగడ పూల దండకు పొంగిపోయి, బుస్సీ నాయుడి భుజం తట్టాడు నాయుడు.తెచ్చిన బంగారు అంచు కండువా కప్పి, బుట్టడు పూలను పాదాలపై కుమ్మరించి, శిరసు వంచి, మరింత మహా వినయ ప్రదర్శన చేశాడు బుస్సీ."అదేటండీ.. దేముడికి తప్ప మనుషుల పాదాల మీద బతికున్నప్పుడు పూలు ఎయ్యగూడదు."– బాగా నొచ్చుకున్నాడు నాయుడు."పర్లేదు నాయుడూ! కలర్ తప్ప స్మెల్ లేని పూలు.. ఎక్కడేసినా ఒకటే!"– గోడకు చేరబడి వెటకారంగా అన్నాడు పరదేశి."అలాక్కాదండీ.. దైవ సమానులైన వారి దగ్గరకు వెళ్లినప్పుడు, తృణమో, పణ మో! పుష్పమో, తోయమో! కాయో, పండో తీసుకెళ్లాలి. వట్టి చేతులతో వెళ్ళకూడదని మా పీఠాధిపతి గారు సెలవిచ్చారు.""నాయనా! ఇక్కడ మా పీటకి నాయుడు గారే అధిపతి. నువ్వొచ్చిన పని ఏటో సెప్పుకో! ఎందుకు, నోట్లో బూరెలొండడం!?"– చిరాకు పడి, తోట వైపు బయలుదేరాడు."ఆడంతే లేండి.. అనకావల్లి సిచ్చుబుడ్డిలాటోడు.. కోపమొస్తే ఎగజిమ్మడమూ.. తర్వాత



దిగవింగిడమూ!"–నవ్వాడు నాయుడు."అలగనీకండి.. ఆమధ్య అనకాపల్లిలో, ఈమధ్య వేట్లపాలెంలో ఏం జరిగింది! సిచ్చుబుడ్డీ వల్లే సిచ్చు పుట్టి .. ఎన్ని ప్రేణాలు.. గాల్లో.. దూల్లో!?""ఫోన్లెండీ.. ఆడి ఊసు మీకేలా! ఏ పనిమీదొచ్చారూ.. సెప్పండి"

## కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదవాడి సొంతింటి కల సహకారం

**గృహ ప్రవేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు అడ్డగోడ ఐలయ్య**



సింగరేణి మార్చి 7 నిర్భయవార్త రిపోర్టర్. : సింగరేణి మండల పరిధిలోని రేగుల గూడెం గ్రామపంచాయతీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి పేద వాడి సొంతింటి కల సహకారం చేయాలని ఉద్దేశంతో నెలకొన్న పథకం ఇందిరమ్మ పథకం. అర్హులైన వారికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయగా వైరా ఎమ్మెల్యే సహకారంతో మంజూరైన ఇండ్లకు మొదటి దశ పూర్తి కావడంతో గృహప్రవేశం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డగోడ రేగుల గూడెం, రామకృష్ణాపురం గ్రామంలో పిట్టల మధు రమాదేవి ఇంటి గృహప్రవేశంలో ఐలయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సహకారంతో ఇందిరమ్మ ఇల్లు 18 మంజూరు కాగా, కొన్ని ఇల్లు గృహప్రవేశం, మరికొన్ని ఇండ్లు స్లాబ్ లెవల్ పూర్తి అయ్యాయని అన్నారు. అడగగానే ఎమ్మెల్యే ఇల్లు మంజూరు చేయగా పేదవాడికి సొంత ఇంటి కల సహకారమైందని మరో విడుదల అర్హులను గుర్తించి వారికి కూడా మంజూరయ్యే విధంగా ఎమ్మెల్యేని కోరుతామని తెలిపారు.

## పంచాయితీ అభివృద్ధి పనులలో నిమగ్నమైన గ్రామ సర్పంచ్.

**ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో పనులలో మేము సైతం అంటూ పనులు చేసిన అధికారులు.**





సింగరేణి మార్చి 7 నిర్భయవార్త రిపోర్టర్. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా శనివారం సింగరేణి మండలంలోని సర్పంచ్ లు పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు . మండల పరిధిలోని భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీలో పలుగు,పారా పట్టిన సర్పంచ్లు బానోత్ హిరాలాల్ , ఎంపీడీవో శ్రీనివాసరావు వీధులను శుభ్రం చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు . కారేపల్లి గ్రామపంచాయతీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో జరుగుతున్న పనులలో కారేపల్లి గ్రామ సర్పంచ్ టోనీ, కార్యదర్శి నెహ్రూ, వార్డు సభ్యులు పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్ జరుగుతున్న పనులను పరిశీలించి దిశ నిర్దేశం చేశారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధి ప్రజలే నిర్ధేశించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో తమ గ్రామాలకు కావల్సిన అభివృద్ధి పనులు గుర్తించి సాధించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీ ఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, సర్పంచులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసిన టేకులగూడెం సర్పంచ్



సింగరేణి మార్చి 7 నిర్భయవార్త రిపోర్టర్. సింగరేణి మండల పరిధిలోని టేకుల గూడెం అంగన్వాడి కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ గుమ్మడి సందీప్ తనిఖీ చేశారు. అంగన్వాడి సూపర్వైజర్ రమణ అంగన్వాడీ కేంద్రంలో విద్యార్థులకు అందుతున్న కార్యక్రమాలను వివరించారు. గర్భిణీలు బాలింతలు ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల లోపు పిల్లలకు గుడ్లు, పాలు, బాలమృతం, ఆరోగ్య లక్ష్మి మెనూ ప్రకారం ప్రతిరోజు అందివ్వాలని సర్పంచ్ సూచించారు. ప్రీస్కూల్, బరువు తక్కువ పిల్లలపై దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామంలో అంగన్వాడి బిల్డింగ్ ఏర్పాటు చేయాలని గ్రామ సర్పంచ్ని కోరారు.

# మహిళలపై జరుగుతున్న దాడులను ప్రతిఘటించండి..

## శ్రామికమహిళా జిల్లా కన్వినర్ జి.పద్మ

## అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ సదస్సు..





దుమ్ముగూడెం మార్చి 7 నిర్భయ వార్త ప్రతినిధి.: అంగన్వాడి నాయకురాలు రత్నావళి అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ జి పద్మ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం లోకీ వచ్చిన దగ్గరనుంచి మహిళలపై దాడులు హత్యలు , అత్యాచారాలు లింగ వివక్ష విపరీతంగా పెరిగాయని అన్నారు. ఈ దాడులను శ్రామిక మహిళలందరూ ప్రతిఘటించాలని అన్నారు. మహిళలపై అత్యాచారాలు హత్యలు జరిగినప్పుడు కారణమైన బాధ్యులను శిక్షించకుండా దోషులకు సహకరించే విధంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు లింగ వివక్ష కులం మతాల వలన వివక్షత గురయ్యేది మహిళలేనని అన్నారు ప్రభుత్వ మరింత పెంచి పోషిస్తుందని అన్నారు కుల దురంకార హత్యలు మత దూరంకర హత్యలు విపరీతంగా పెరుగుతున్నాయని వీటికి బాలయ్య ఏది మహిళలేనని అన్నారు వీటిని నిరోధించాల్సినటు వంటి పాలకులు చోద్యం చేస్తున్నారని అన్నారు ఇప్పటికైనా మహిళలపై జరుగుతున్న దాడులను హత్యలను అత్యాచారాలను వివక్షతను హరికట్టాలని మహిళా చట్టాలను పకడిబందగా అమలు చేయాలని డిమాండ్ చేశారు ఉన్న చట్టాలను ఉంచకుండా వాటిని రద్దు చేస్తూ నైట్ షిఫ్ట్ లలో మహిళలు పనిచేయాలని నిర్ణయం చేసింది కేంద్ర బీజేపీ ప్రభుత్వం అని అన్నారు నైట్ షిఫ్ట్ లో పనిచేసే వారికి ఎటువంటి సౌకర్యాలు కల్పించాలని చట్టంలో లేకపోవడం దుర్మార్గమని అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం పని ప్రదేశాల్లో మెరుగైనటువంటి సౌకర్యాలు మహిళా కార్మికులకు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వంశీకృష్ణ మాట్లాడుతూ కార్మికులను రైతులను వ్యవసాయ కూలీలను పేద ప్రజలను నష్టం చేసేవిందగా లేబర్ కోడ్ లు విత్తన చటం విద్యుత్ బిల్లు విబిజీ రాంజీ విధానాలను తీసుకొచ్చిందని పేదలను మరింత పేదలుగా చేసే విధంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయని అన్నారు ఈ విధానాలను శ్రామిక మహిళలందరూ ఐక్యంగా వ్యతిరేకించాలని అన్నారు శ్రామికమహిళలుగా అన్ని రంగళ్లలో ముందు ఉన్నపటికీ ఇంకా మహిళపై వివాక్సత ఉందని మహిళలుగా స్వత్తగా తంత్రంగ నిర్ణయాలు చేసిన్నాడే మహిళా సాధికారకత సాధ్యమని అన్నారు అదిశగా మహిళా దినోత్సవ స్ఫూర్తితో ముందుకెళ్లాలని అన్నారు కేంద్ర ప్రభుత్వం ఈ విధానాలకు వ్యతిరేకంగ అంతర్జాతీయ శ్రామిక మహిళలు అందరూ ఐక్యంగా పోరాటాలు చేయాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో లక్ష్మీ నగరం సర్పంచ్ సరియం రాజమ్మ, అంజి పాక సర్పంచి కొమరం శాంతి, ఉపసర్పంచ్ తిరుపతమ్మ విజయ ఆదిలక్ష్మి చెల్లెమ్మ లక్ష్మీ అలివేలు కమల విజయలక్ష్మి మణి అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు..

## తూంకుంటలో శ్రీ సాయి భవాని బోన్ సెట్టింగ్ సెంటర్ ప్రారంభం

**పాల్గొన్న జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి**



తూంకుంట నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: గ్రేటర్ మల్కాజ్‌గిరి పరిధిలోని తూంకుంటలో నర్సింహా ఏర్పాటు చేసిన శ్రీ సాయి భవాని బోన్ సెట్టింగ్ సెంటర్ ఘనంగా ప్రారంభమైంది. వారి ఆహ్వానం మేరకు జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి స్థానిక నాయకులతో కలిసి రిబ్బన్ కట్ చేసి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భీమిడి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి వైద్య సేవలు స్థానికంగా అందుబాటులోకి రావడం ఎంతో ఆనందకరమని తెలిపారు. ఎముకల గాయాలు, మెలికలు వంటి సమస్యలకు చికిత్స అందించే ఈ బోన్ సెట్టింగ్ సెంటర్ ద్వారా తూంకుంటతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా యజమాని నర్సింహాకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిసస్తూ మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్ఎస్ బాల్‌రాజు గౌడ్, మన్నే బిక్షపతి, టీఆర్ రవీందర్ గౌడ్, మేకల అంజనేయులు, సందని ఆనంద్, బాణాల భూపాల్ రెడ్డి, లింగం గౌడ్, సామల దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కొత్తగా ప్రారంభమైన శ్రీ సాయి భవాని బోన్ సెట్టింగ్ సెంటర్ ప్రాంత ప్రజలకు ఉపయోగపడాలని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.



## ఇందిరమ్మ ఇల్లుతో సొంతింటి కల సాకారం...



మూడుచింతలపల్లి, నిర్భయ వార్త ప్రతినిధి : మేడ్చల్ జిల్లా,అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని యాడారం 12వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించిన అంకం లక్ష్మీ--బిక్షపతి దంపతుల నూతన గృహానికి ఘనంగా గృహప్రవేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్--మల్కాజ్గిరి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ హాజరై గృహప్రవేశాన్ని ప్రారంభించి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కల సాకారం అవుతోందన్నారు. అర్హులైన ప్రతి నిరుపేద మహిళకు సొంత ఇల్లు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మంజూరైన ఇళ్లకు విడతల వారీగా సకాలంలో బిల్లులు అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ శిరీష కృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ బొమ్మలపల్లి నరసింహులు యాదవ్, మేడ్చల్ జిల్లా ఆర్టిఏ మెంబర్ భీమిడి జయపాల్ రెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, మూడుచింతలపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేశం, కౌన్సిలర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసర వైద్య చికిత్సకు రూ.2.50లక్షల సీఎంఆర్ఎఫ్.

**ఎల్ఓసీ మంజూరు పత్రం అందజేసిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి**



సింగరేణి మార్చి 7 నిర్భయవార్త రిపోర్టర్. : ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ప్రత్యేక చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి ( సీఎంఆర్ఎఫ్ ) ద్వారా సింగరేణి మండల పరిధిలోని మాదారం గ్రామానికి చెందిన గుంపెనపల్లి విజయలక్ష్మి కి రూ. 2, 50,000విలువ చేసే ఎల్ వోసీ ( లెటర్ ఆఫ్ క్రెడిట్ ) మంజూరైంది. తీవ్రమైన కీళ్ల నొప్పులతో బాధపడుతున్న బాధితురాలు ఇటీవల ఎంపీ రఘురాం రెడ్డి గారిని కలిసి.. తన గోడును వెళ్ళబోసుకోగా.. మానవతా దృక్పథంతో స్పందించిన ఎంపీ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారు. దీంతో.. నిజామ్స్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ( నిమ్స్)లో మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు.. రూ. 2.50లక్షలను కేటాయించగా.. ఆ మంజూరు పత్రాన్ని బాధితురాలి కుటుంబ సభ్యులకు ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి శనివారం హైదరాబాద్ లోని తన నివాసంలో అందజేసి, విజయలక్ష్మి త్వరగా కోలుకొని, సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా.. తమ బాధ తెలుసుకొని వైద్య చికిత్స కు అండగా నిలిచిన పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డికి బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## అప్పాయిగూడెం గ్రామంలో పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యే

**ఎమ్మెల్యే రాందాస్ నాయకులు శాలువాతో సత్కరించిన గ్రామ సర్పంచ్**



సింగరేణి మార్చి 7 నిర్భయవార్త రిపోర్టర్. 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక భాగంగా అప్పాయిగూడెం పంచాయతీ, సింగరేణి మండలం తులిస్యతండా గ్రామానికి పారిశుధ్యం పనులను వైరా శాసనసభ్యులు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి రాందాస్ నాయక్ పర్యవేక్షించారు. గ్రామ సర్పంచ్ దండు ప్రవీణ్ ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల పరిధిలోని గ్రామాలలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా కొనసాగాలని ప్రజలు కోరుకున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి సంక్షేమ పథకాలు అర్హులకు తగ్గాలని, గ్రామ సర్పంచులు పనులను పర్యవేక్షిస్తూ అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని తెలిపారు. పనులలో నిర్వీర్యం చేస్తే సవించేది లేదని తెలిపారు. గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేని కోరారు.

# మహిళలు సంకల్పం, సామర్థ్యంతో ప్రతి రంగంలో రాణించగలరు: సీపీ అవినాష్ మొహంతి

**మల్కాజ్‌గిరి కమిషనరేట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు**
**ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు**



ఉప్పల్ నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఉప్పల్‌లోని శ్రీరస్తు కన్వెన్షన్ హాల్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి కమిషనరేట్‌కు చెందిన వివిధ విభాగాల మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతి, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. మహిళలు అపారమైన సంకల్పం, సామర్థ్యాన్ని కలిగి ఉంటారని, అంకితభావం మరియు నిబద్ధతతో ప్రతి రంగంలోనూ విజయం సాధించగలరని తెలిపారు. ప్రస్తుతం మహిళలు అనేక రంగాల్లో పురుషులతో సమానంగా పోటీ పడుతూ అద్భుతమైన పురోగతి సాధిస్తున్నారని పేర్కొన్నారు. స్త్రీలను గౌరవించడం భారతీయ సంస్కృతిలో అంతర్భాగమని, దేశవ్యాప్తంగా మహిళలు అనేక రంగాలలో నాయకత్వ పాత్రలు పోషిస్తున్నారని కమిషనర్ పేర్కొన్నారు. మహిళా పోలీసు అధికారులు తమ విధులను నమ్మకంతో, ధైర్యంతో నిర్వహిస్తూ వృత్తిపరమైన మరియు వ్యక్తిగత బాధ్యతలను సమతుల్యం చేసుకోవాలని ప్రోత్సహించారు. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్‌లో మహిళా సిబ్బంది అందిస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, నేర పరిశోధన, మహిళా భద్రత వంటి విభాగాల్లో మహిళా పోలీసులు సమర్థవంతంగా పనిచేస్తున్నారని తెలిపారు. గృహ హింసతో పాటు ఇతర సామాజిక సమస్యల బాధితులకు మహిళా పోలీసులు మద్దతు, కౌన్సెలింగ్ అందిస్తూ సమాజానికి సేవ చేస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు సాధిస్తున్న విజయాలు యువతరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని, మహిళా సిబ్బంది సంక్షేమం, భద్రత మరియు వృత్తిపరమైన అభివృద్ధికి మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఇతర అతిథి వక్తలు కూడా పాల్గొని ఆరోగ్యం, పోషకాహారం, ఆర్థిక నిర్వహణ, మనస్తత్వశాస్త్రం వంటి అంశాలపై అవగాహన సెమినార్లు నిర్వహించారు. మల్కాజ్‌గిరి కమిషనరేట్‌కు చెందిన సీనియర్ అధికారులు, డీసీపీలు, మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.











# ఈ పదవులు, సన్మానాలు, సత్కారాలు అంబేద్కర్ చలువే

## గంగాధర్ (నాని )రాష్ట్ర ఉపాధ్యక్షులు, భాజపా -ఎస్సీ మోర్చా





ఏలూరు మార్చి 07 నిర్భయవార్త ప్రతినిధి : ఏలూరు పాత బస్ స్టాండ్ వద్ద ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్ నందు సన్మాన కార్యక్రమం అల్ ఎంప్లాయిస్ ఉ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగింది. సన్మాన కార్యక్రమం అనంతరం గంగాధర్ మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాల్లో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని వదే వదే పార్టీలు ప్రస్థావిస్తున్నాయని ఇది శుభసూచికం అన్నారు పార్టీలో పార్టీ ఆదేశాల మేరకు పనిచేస్తే కచ్చితంగా పదవులు వరిస్తాయని దానికి నేనే ఉదాహరణ అని తెలిపారు. ప్రస్తుతం మనం అన్నీ అగ్ర కులాలతో శాసనసభ్యులు గా లోక్ సభ సభ్యులుగా సమాన హక్కులు పొందుతున్నాం అంటే అంబేద్కర్ గారు రచించిన రాజ్యాంగ ఫలమే అని గుర్తు చేసారు. పనిచేసే వాడికి పార్టీలో ఎప్పటికైనా గుర్తింపు లభిస్తుందని ప్రజల్లో కష్టమైన పనులను ఇష్టంగా భావించి పనిచేస్తే ఇలాంటి సన్మానాలు సత్కారాలు జరుగుతాయని గంగాధర్ తెలిపారు. దాసరి నాగేంద్ర కుమార్ గారు పోస్టల్ శాఖ నుండి రిటైర్డ్ అయినా ఇంకా సేవకార్యక్రమాలు కొనసాగిస్తున్నారని అయనది అంబేద్కర్ భావజాలం అందిపుచుకున్నారని కొనియాడారు. అలానే నేతల రమేష్ గారు ఉన్నతమైన వ్యక్తులని తయారు చేసే కర్మాగారం అని అయన తయారుచేసిన నాయకుల్లో తాను ఒకడినని తెలిపారు ఈసందర్భంగా ఈరోజు కార్యక్రమం నాకు దాసరి నాగేంద్ర కుమార్ అధ్యక్షత వహించగా విశిష్ట ముఖ్య అతిధులుగా స్థానిక ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి గారు ), భాజపా ఏలూరు జిల్లా అధ్యక్షులు చౌటపల్లి విక్రమ్ కిషోర్ గారు, జోనల్ ఏ పి ఎస్ ఆర్ టి సి జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు గారు విచ్చేయగా అతిధిలుగా దాసరి రమేష్ బాబు,డా. మెండెం రమేష్ బాబు, పళ్లెం ప్రసాద్, నేతల రమేష్ బాబు సీనియర్ దళిత నాయకులతో పాటు 100 మందికి పైగా నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ముఖ్య నాయకులు శాలువా, పూల దండలతో సత్కరించి మెమెంటో బహుకరించిన సందర్భం.

# అనాధ స్థితిలో ఉన్న మహిళకు ఆశ్రయం

## మహిళను హమారా ఫౌండేషన్‌కు తరలించిన యూసీడీ అధికారులు

కూకట్‌పల్లి నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: మూసాపేట మెట్రో స్టేషన్ వద్ద అనాధ స్థితిలో ఉన్న మహిళను గుర్తించిన జీహెచ్‌ఎంసీ యూసీడీ అధికారులు ఆమెకు సహాయం చేసి హమారా ఫౌండేషన్ ఆధ్వర్యంలోని వృద్ధాశ్రమానికి తరలించారు. గత రెండు రోజులుగా మూసాపేట మెట్రో స్టేషన్ వద్ద ఉన్న పిల్లర్ నెంబర్ 924 దగ్గర రమణమ్మ 47 అనే మహిళ ఒంటరిగా ఉండడం స్థానికులు గమనించారు. ఈ విషయాన్ని జీహెచ్‌ఎంసీ యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ సురేష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించారు. సి.ఓ మురళి, రిసోర్స్ పర్సన్స్ కృష్ణవేణి, స్వాతి మరియు పోలీస్ సిబ్బంది సహాయంతో ఆ మహిళను అక్కడి నుంచి తరలించారు. రమణమ్మ తెలిపిన వివరాల ప్రకారం ఆమె భర్త మూడు నెలల క్రితం మరణించగా, ఆల్విన్ కాలనీలో నివసించేదని చెప్పారు. తనకు ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారని, ఇంటిని మార్చుతామని చెప్పి తనను తీసుకువచ్చిన కొడుకు మూసాపేట మెట్రో స్టేషన్ వద్ద వదిలేసి వెళ్లిపోయాడని ఆమె వెల్లడించారు. చేతిలో డబ్బు లేకుండా, తినడానికి ఆహారం కూడా లేకుండా కేవలం ఒక బ్యాగ్ బట్టలతో మెట్రో స్టేషన్ వద్దే ఉండిపోయినట్లు తెలిపారు. ఈ సమాచారం తెలుసుకున్న యూసీడీ అధికారులు వెంటనే స్పందించి హమారా ఫౌండేషన్, లైఫ్ జీనా ఫరెవర్ ఎల్డర్ హోమ్ సహకారంతో రమణమ్మను శివానందనగర్‌లోని జీనా ఎల్డర్ కేర్ హోమ్కు తరలించారు. ఈ కార్యక్రమంలో హమారా ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ మునావర్ షేక్ కూడా సహకరించారు. అనాధ స్థితిలో ఉన్న మహిళకు ఆశ్రయం కల్పించిన జీహెచ్‌ఎంసీ యూసీడీ అధికారులు, హమారా ఫౌండేషన్ సభ్యుల సేవలను స్థానికులు అభినందించారు.



# వైద్యశాలలో అపరిశుభ్రతపై కలెక్టర్ ఆగ్రహం..

**స్వయంగా చీపురు పట్టి ఊడ్చిన వైనం!**




కొమరంభీం, మార్చి 7 నిర్భయవార్త : పరిశుభ్రత అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ హరిత అన్నారు. శనివారం దహెగాం మండలం కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంలో నెలకొన్న అపరిశుభ్రతను చూసి ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మీ ఇంట్లో అయితే ఇలాగే ఉంచుతారా? అని సిబ్బందిని ప్రశ్నించారు. ఆసుపత్రి పనితీరును, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వార్డులో, ఆసుపత్రి ప్రాంగణంలో చెత్తాచెదారం పేరుకుపోయి ఉండటం గమనించి స్వయంగాచీపురు పట్టి ఊడ్చారు. రోగులు కోలుకోవాల్సిన చోట ఇలాంటి అపరిశుభ్ర వాతావరణం ఉండటంపై అక్కడి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ ఆసుపత్రి పరిసరాలను పర్యవేక్షించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఉన్నతాధికారి హోదాలో ఉండి కూడా ఆమె స్వయంగా చీపురు పట్టి శుభ్రం చేయడం చూసి రోగులు, ఆసుపత్రి సిబ్బంది ఒక్కసారిగా విస్తుపోయారు. వేంటనే ఆమెతో కలిసి పారిశుద్ధ్య పనుల్లో పాల్గొన్నారు.

# దంచికొడుతున్న ఎండలు.. మార్చి మొదటి వారంలోనే

హైదరాబాద్, మార్చి 7నిర్భయవార్త :: తెలంగాణలో మార్చి మొదటి వారం నుంచే ఎండలు దంచికొడుతున్నాయి. ఎండల తీవ్రత, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్న పరిస్థితి. ఉదయం11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బయట తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని భారత వాతావరణ విభాగం అధికారులు కీలక సూచనలు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 34 నుంచి 40 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. ఈరోజు, రేపు పలు జిల్లాల్లో 36 నుంచి 40 డిగ్రీల మధ్య గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. ఈరోజు భద్రాచలం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్, ఖమ్మంలో 38 డిగ్రీలు.. రామగుండెం, నిజామాబాద్, హైదరాబాద్, దుండిగల్, హకీంపేట్ ప్రాంతాల్లో 37 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి. శనివారం(మార్చి 7) నుంచి సోమవారం(మార్చి 9) వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు ఐఎండీ అధికారులు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉండనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు అధికంగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. హైదరాబాద్‌లోనూ గత రెండు రోజుల్లో 2 డిగ్రీలు పెరిగాయని అధికారులు తెలిపారు. పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 డిగ్రీలు పైబడితే వడగాలుల అలర్ట్ జారీ చేస్తామని ఐఎండీ అధికారులు వెల్లడించారు.

# ఇంగ్లీషు భాషా పరిజ్ఞానం పెరిగేలా ఎవ్రీ చైల్డ్ రీడ్స్ అమలు.. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ఖమ్మం, మార్చి -7 నిర్భయవార్త రిపోర్టర్.: పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు ఇంగ్లీష్ బాషా పరిజ్ఞానం మెరుగుపర్చి, రీడింగ్ స్కిల్స్ పెంపొందేలాగా ఉపాధ్యాయులు కృషి చేసి విద్య బోధన అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శనివారం కొణిజర్ల మండలం పల్లిపాడు బస్ స్టేజి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించే ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం అమలును జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను తిరుగుతూ విద్యా బోధనను గమనించారు. నాలుగు, ఐదవ తరగతి గదులలో విద్యార్థులను ప్రత్యేకంగా అందించిన రైమ్స్ ఎలావున్నాయి, అని అడిగారు. బోర్డు పై ఇంగ్లీషు అక్షరాలు, పదాలు, పద్యాలు వ్రాసి వాటియొక్క ఉచ్చారణ, అర్థం చేసుకుంటూ, తిరిగి చెప్పగలుగుతున్నారా, ధ్వనులను బట్టి ఇంగ్లీష్ పదాలను గుర్తిస్తున్నారా అని అడిగి విద్యార్థుల సామర్థ్యాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి విద్యార్థికి చదివే సామర్థ్యం కల్పించాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా ఎవ్రీ చైల్డ్ రీడ్స్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించామని అన్నారు. విద్యా ప్రమాణాల పెంపుదలతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు లభిస్తుందన్నారు. విద్యార్థులకు ముందుగా చదవడం, చదివింది అర్థం చేసుకోవడం అనే నైపుణ్యాలు రావడం చాలా కీలకమని అన్నారు. ఒక విద్యార్థికి చదివే సామర్థ్యం అందిస్తే జీవితాంతం ఉపయోగపడుతుందని, విద్యార్థుల చదివే సామర్థ్యం పెంపు చేయడం కోసం చేపట్టిన ఎవ్రీ చైల్డ్ రీడ్స్ ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధపెట్టి భోదన చేయాలన్నారు. ప్రతి రోజు విద్యార్థి గంట సేపు చదివే సామర్థ్యంపై అభ్యాసన చేసేలా సాంకేతిక పరిజ్ఞానంతో ఒక బుక్‌లెట్ తయారు చేయడం జరిగిందని అన్నారు. బుక్లెట్ లో ఉన్న అంశాలను తూ.చ. తప్పకుండా ఉపాధ్యాయులు ఫాలో అవుతూ పిల్లలు చదివే సామర్థ్యం పెంపొందేలా కృషి చేయాలని అన్నారు. ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమ పర్యవేక్షణకు ఒక యాప్‌ను యూ.డి.ఐ.ఎన్. తో అనుసంధానం చేయడం వల్ల ఎటువంటి డాటా ఎంట్రీ అవసరం ఉండదని, ప్రతి బుధవారం విద్యార్థి రీడింగ్ స్కిల్స్ ఏ స్థాయిలో ఉన్నాయో (అక్షరాలు, పదాలు, వ్యాఖ్యలు) అప్ డేట్ మాత్రం చేయాలని అన్నారు. ఆంగ్ల అక్షరాలను ఫోనెటిక్ సౌండ్ తో సహా నేర్పేలా కోర్సు డిజైన్ చేశామని అన్నారు. మొదటి దశతో పాటు రెండవ దశ పై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెడితే ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం పరిపూర్ణంగా అమలు చేయవచ్చుని, ప్రతి విద్యార్థి కనీసం ఒక పేరాగ్రాఫ్ చదివి అర్థం చేసుకునే స్థాయికి చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం ప్రతి రోజు పాఠశాల సమయాల్లోనే ప్రాథమిక తరగతి విద్యార్థులకు అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొణిజర్ల తహసీల్దారు అరుణ, సిఎంఓ ప్రవీణ్ కుమార్, హెడ్ మాస్టర్ లు, సంబంధిత టీచర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రిపై శాస్త్రోక్తంగా కుంభాభిషేక ద్వితీయ దినోత్సవ క్రతువులు - యాగశాలలో వెల్లివిరిసిన మంత్రోచ్ఛారణలు.

నిర్భయవార్త ప్రతినిధి :విజయవాడ,ఇంద్రకీలాద్రి, 07 మార్చి 2026 :విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ



సన్నిధిలో అత్యంత వైభవంగా జరుగుతున్న మహా కుంభాభిషేక మహోత్సవాలు రెండవ రోజుకు చేరుకున్నాయి. శనివారం సాయంత్రం యాగ శాలలో నిర్వహించిన విశేష పూజా కార్యక్రమాలు ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లాయి.?యా గశాల కార్యక్రమాల ఆధ్యాత్మిక విశిష్టత:?మూల మంత్రహవనములు: సాయంత్రం 4 గంటల నుండి వేద పండితులు, అర్చక స్వాముల ఆధ్వర్యంలో 'మూల మంత్రహవనములు' అత్యంత నిష్ఠతో ప్రారంభమయ్యాయి. లోక కళ్యాణార్థం, అమ్మవారి దివ్యశక్తిని పునఃప్రతిష్ఠాపన చేసే క్రతువులో



భాగంగా నిర్వహించిన ఈ హోమగుండాల నుండి వెలువడిన మంత్రోచ్ఛారణలు కొండంత ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపాయి.?ప్రదోషకాల పీఠపూజలు: అత్యంత పవిత్రమైన ప్రదోష కాలంలో పీఠపూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శక్తి స్వరూపిణి అయిన దుర్గమ్మకు మూల మంత్ర పూర్వక అష్టోత్తర శతనామావళితో అర్చనలు చేస్తూ, పీఠం వద్ద ప్రత్యేక పూజలు సమర్పించారు.?హారతి ఢ మంత్రపుష్పం: సాయంత్రం వేళ యాగశాల పరిసరాలు కర్పూర నీరాజనాలతో కాంతిమయమయ్యాయి. వేద మంత్రాల సాక్షిగా స్వామి, వార్లకు 'మంత్రపుష్పం' సమర్పించి, భక్తులందరికీ క్షేమం కలగాలని ప్రార్థించారు. ఈ వేడుకను దర్శించుకున్న భక్తులు మంత్రపుష్ప వైభవాన్ని చూసి తన్మయత్వం చెందారు.?రెండవ రోజు క్రతువులన్నీ నిర్విఘ్నంగా పూర్తి కావడంతో ఇంద్రకీలాద్రిపై భక్తి భావం వెల్లివిరిసింది. ఈ మహోత్సవంలో దేవస్థాన అధికారులు, వేద పండితులు మరియు వేలాదిగా తరలివచ్చిన భక్తులు పాల్గొని తరించారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంధర్భంగా జిల్లా మహిళలు అందరికీ జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి శుభాకాంక్షలు తెలియజేశారు



నిర్భయవార్త ప్రతినిధి : ఏలూరు, మార్చి 07: జిల్లా కలెక్టరేటు జిల్లా కలెక్టరు ఛాంబర్లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా మహిళలందరికీ జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని, కుటుంబం నుంచి దేశ, రాష్ట్ర అభివృద్ధి వరకు ప్రతి రంగంలో మహిళలు తమ ప్రతిభను చాటుతూ ముందుకు సాగుతున్నారని తెలిపారు. మహిళలు సాధికారతకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థిక, సామాజికంగా మరింత బలోపేతం కావాలని జిల్లా కలెక్టరు ఆకాంక్షించారు. విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి అన్ని రంగాలలో మహిళలు పురోగతి సాధించడం ద్వారా సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళలు తమ హక్కులు, అవకాశాలను సద్వినియోగం చేసుకుని స్వయం సమృద్ధికి దోహదపడాలని పిలుపునిచ్చారు. జిల్లా అభివృద్ధిలో మహిళలు భాగస్వామ్యం మరింత పెరగాలని ఆమె ఆకాంక్షించారు

# జిల్లాలో తలసరి ఆదాయాన్ని పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించాలి






**జిల్లాలో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు (SDG), KPI లలో మరింత పురోగతి చూపించాలి.. ప్రభుత్వ శాఖలు మంచి సేవలందించాలి జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**

కర్నూలు, మార్చి 07, నిర్భయవార్త ప్రతినిధి : రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో తలసరి ఆదాయాన్ని పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, జిడిడిపి మరియు జిల్లా కీలక పనితీరు సూచికలకు సంబంధించి వ్యవసాయ అనుబంధ శాఖలు, రవాణా, ఐసిడిఎస్, సంక్షేమం, టూరిజం, ఆర్టీసీ, పరిశ్రమలు, ఆర్ డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, రోడ్లు భవనాలు తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తలసరి ఆదాయం పెంచే దిశగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ స్పష్టమైన ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా లక్ష్యాలు కేటాయించుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు (ాణ+), ఖూ× లలో మంచి పురోగతి ఉన్నప్పటికీ ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. సాగునీటి ప్రాజెక్టుల ద్వారా సాగుభూమి విస్తీర్ణాన్ని పెంచి రైతుల ఆదాయాన్ని మెరుగుపరచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే వ్యవసాయ అనుబంధ శాఖలు, పరిశ్రమలు, టూరిజం తదితర శాఖల ద్వారా తలసరి ఆదాయాన్ని పెంచే విధంగా ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శాఖలోని ముఖ్య అంశాలు, బడ్జెట్ వివరాలు, ఆన్‌లైన్ సేవలు అన్నీ క్లుప్తంగా (ఫ్ ఖ స్త్రశ్రీఖఅఎవ) నివేదిక ను తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. టీనేజీ ప్రెగ్నెన్సీ కి సంబంధించి లక్ష్యాలు సాధించే విధంగా కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలన్నారు. పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ అంశంలో వెనుకబడి ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రభుత్వ శాఖలు మంచి సేవలందించాలన్నారు. జిల్లాలో హాస్టళ్ల నిర్వహణ, ఐసిడిఎస్, వైద్య ఆరోగ్య శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి అసంతృప్తిగా ఉన్నారని, ఆయా శాఖల అధికారులు ప్రజలకు మంచి సేవలందించి శాఖల పనితీరును మెరుగుపరచుకోవాలన్నారు. జిల్లాలో టీనేజ్ ప్రెగ్నెన్సీ లను నియంత్రించేందుకు ఐసిడిఎస్ పీడీ మరియు డీఎంహెచ్ఓలు కలిసి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొం దించాలన్నారు. పబ్లిక్ పర్సెప్షన్‌లో నెగిటివ్ ఫీడ్‌బ్యాక్ వస్తున్న శాఖల అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. . హాస్టళ్లను, పాఠశాలల ను ఎంపిడిఓ లు వారానికి ఒక్కసారి తనిఖీ చేసి ఫోటో లను పంపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.కింది స్థాయి సిబ్బంది క్షేత్ర స్థాయి సందర్శనలకు వెళ్లినపుడు ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించా లని కలెక్టర్ సూచించారు.. ప్రజలకు మంచి సేవలం దించాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యమని, ఆ దిశగా అన్ని శాఖల అధికారులు పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు


సంతమాగులూరు, మార్చి 7, నిర్భయవార్త ప్రతినిధి : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ఉర్దూ) కొమ్మాలపాడు పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా "మహిళలకు



సహకారాన్ని అందిద్దాం.. సమాజ అభివృద్ధిని సాధిద్దాం" అనే నినాదంతో కార్యక్రమం జరిగింది. పాఠశాలలో సేవలందిస్తున్న మహిళా ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సత్కరించి వారి సేవలను ప్రశంసించారు. విద్యా రంగంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని పలువురు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మసనం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఎంపీపీ ఎస్ కొమ్మాలపాడు (హెచ్‌ఈ) ప్రధానోపాధ్యాయులు పి.సిహెచ్. పుల్లారావు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు వేమవరపు కోటేశ్వరరావు, దార్ల దినేష్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని మహిళా ఉపాధ్యాయులను అభినందించారు. మహిళలకు గౌరవం, సహకారం అందించినప్పుడే సమాజం అభివృద్ధి సాధిస్తుందని వారు పేర్కొన్నారు.

## ఏల్చూరులో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక తిరునాళ్లకు సర్వం సిద్ధం

సంతమాగులూరు, మార్చి 7, నిర్భయవార్త ప్రతినిధి : సంతమాగులూరు మండలం, ఏల్చూరు గ్రామంలో ఓరుగంటి కుటుంబాలు ఇలవేల్పుగా భావించే పవిత్ర క్షేత్రం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వార్షిక తిరునాళ్లు ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ



సందర్భంగా ఆలయ చరిత్ర, ఆధ్యాత్మిక వైభవం, భక్తుల విశ్వాసాలకు నిలయంగా నిలిచిన ఈ క్షేత్రం ప్రత్యేకతలను పాఠకులకు పరిచయం చేయాల్సిన అవసరం ఏర్పడింది. తరతరాలుగా కొనసాగుతున్న భక్తి సంప్రదాయం ఏల్చూరు గ్రామంలోని ఓరుగంటి వంశీకులు ఈ ఆలయాన్ని తమ ఇలవేల్పుగా భావిస్తూ తరతరాలుగా స్వామివారిని సేవిస్తున్నారు. కుటుంబాల్లో జరిగే ప్రతి శుభకార్యానికి ముందు స్వామివారి దర్శనం తీసుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోంది. పుట్టిన పిల్లలకు నామకరణం నుంచి వివాహాలు వరకు అన్ని శుభ కార్యక్రమాల్లో స్వామివారి ఆశీస్సులు తీసుకోవడం కుటుంబ సంప్రదాయంగా నిలిచింది. కష్టాలను తొలగించే కరుణామయుడు స్థానికుల నమ్మకం ప్రకారం స్వామివారిని భక్తి శ్రద్ధలతో ప్రార్థిస్తే జీవనంలో ఎదురయ్యే కష్టాలు తొలగిపోతాయని విశ్వసిస్తారు. అనారోగ్యాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు వంటి సమస్యలతో వచ్చిన భక్తులు స్వామివారి కృపతో ఉపశమనం పొందారని అనుభవాలు చెబుతుంటారు. అందుకే సమీప గ్రామాలతో పాటు దూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. పురాతన మండపం ప్రత్యేక ఆకర్షణ ఆలయం సమీపంలో ఉన్న పురాతన శిలా మండపం ఈ క్షేత్రానికి ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తోంది. శతాబ్దాల క్రితం నిర్మించిన ఈ మండపం అప్పటి శిల్పకళా వైభవాన్ని ప్రతిబింబిస్తూ భక్తులను ఆకట్టుకుంటోంది. ఆలయ చరిత్రకు ఇది సాక్ష్యంగా నిలుస్తోందని స్థానికులు చెబుతున్నారు. తిరునాళ్లతో ఆధ్యాత్మిక సందడి ప్రతి సంవత్సరం జరిగే వార్షిక తిరునాళ్ల సందర్భంగా ఏల్చూరు గ్రామం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడుతుంది. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, హారతులు నిర్వహించడంతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు కూడా చేపడతారు. ఈ వేడుకలకు గ్రామస్థులు, ఓరుగంటి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి భావంతో సేవలు అందిస్తారు. శతాబ్దాల చరిత్రను మోస్తూ భక్తుల విశ్వాసాలకు నిలయంగా నిలిచిన ఏల్చూరు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం నేటికీ భక్తి, ఆధ్యాత్మికతకు

## నెల్లూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ధ్వర్యంలో సందడిగా మహిళా దినోత్సవ వేడుకలు.

నెల్లూరు నిర్భయవార్త ప్రతినిధి : నెల్లూరు గాంధీ నగర్ ాచీ కళ్యాణ మండపంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి ,వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇన్ చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వైసిపి మహిళా విభాగం రాష్ట్ర




వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాని పూజిత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మహిళలు కేక్ కటింగ్ నిర్వహించి.. సందడిగా మహిళా దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. అనంతరం వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన.. 10 మంది మహిళలను.. ఎంపిక చేసి.. అతిథులు ఘనంగా సత్కరించారు.గత ప్రభుత్వంలో మహిళా సాధికారత దిశగా.. జగన్మోహన్ రెడ్డి మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూగత వైసిపి ప్రభుత్వంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో.. అనేక విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారని తెలిపారు .ముఖ్యంగా చేయూత, కాపు నేస్తం, ఆసరా, సున్నా వడ్డీ, పథకాలు అమలు చేసి..మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారిదని కొనియాడారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఆడబిడ్డ నిధి ఇస్తామని చెప్పి.. మహిళలను దగా చేసిందని మండిపడ్డారు. నేడు అంగన్వాడి మహిళలు జీతాలు పెంచమని రోడ్డెక్కితే ప్రభుత్వానికి మహిళలు అన్న కనీస సానుభూతి లేకుండా నిర్ధాక్షణంగా రోడ్డుమీద ఈడ్చి పారేస్తూ నరకం చూపిస్తున్నారని అన్నారు.గత ప్రభుత్వంలో 7వేలు ఉన్న అంగన్వాడీల వేతనాలను 11500 లకు పెంచి వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు మహిళల కు వెన్నుదన్నుగా నిలిచారని అన్నారు.మహిళల సంక్షేమం, సాధికారతే లక్ష్యంగా.. వైయస్ జగన్మోహన్ రెడ్డి గత ప్రభుత్వంలో పాలన అందించారని తెలిపారు. అనంతరం మహిళలు.. రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి.. నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు..కూటమి ప్రభుత్వంలో మహిళలపై జరుగుతున్న దారుణాలు.. అన్యాయాలపై పోరాటం సాగించాలని పలు తీర్మానాలు చేసి నిర్ణయించుకున్నారు.ఈ కార్యక్రమంలో జోనల్ మహిళా అధ్యక్షురాలు మొయిళ్ళ గౌరీ, వైసిపి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు లక్ష్మీ సునంద, 8 డివిజన్ కార్పొరేటర్ కామాక్షి దేవి, గారు,50 వ డివిజన్ కార్పొరేటర్ గుంజి జయలక్ష్మి , నెల్లూరు నగర నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు ధనుజా రెడ్డి, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు వాణి, మహిళా విభాగం నేతలు సుప్రియ, సుహాసిని, రమీజా, సులోచనమ్మ,తదితరులు పాల్గొన్నారు.



# రేండవ రోజు మహా కుంభాభిషేకములో జిల్లా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

నిర్భయవార్త ప్రతినిధి : విజయవాడ:ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీష ఐఏఎస్ ఆదేశాల మేరకు జిల్లా లోని ఎంఆర్ఆర్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పివి సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్, నలంద డిగ్రీ కళాశాల మరియు ఆదిత్య డిగ్రీ కళాశాల కు చెందిన 200 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మరియు విద్యార్థులు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల ఆలయం నందు ప్రతిష్టాత్మ జరుగుతున్న మహా



కుంభాభిషేకంలో భక్తులకు సేవలు అందించడానికి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్వచ్ఛంద సేవకు విరివిగా పాల్గొన్నట్లు ఎన్టీఆర్ జిల్లా సీఈవో యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ మరియు ఎన్ఎస్ఎస్ డిస్టిక్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లేటి రమేష్ తెలిపారు. దేవస్థానం అధికారులు కల్పిస్తున్న సౌకర్యాలపై భక్తుల నుంచి అభిప్రాయ సేకరణ, భక్తుల నుంచి సేకరణ, క్యూ లైన్ లో నియంత్రణ, త్రాగునీరు పంపిణీ, మజ్జిగ బిస్కెట్స్ పంపిణీ, మెడికల్ క్యాంప్ సేవలు, వికలాంగులకు సేవలు అందించారని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ను ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీ శీను నాయక్ గారు ఏఈఓ శ్రీ గంగాధర్, జిల్లా సీఈవో యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ మరియు డిస్టిక్ ప్రోగ్రాం ఆఫీసర్ కొల్లేటి రమేష్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ను అభినందించారు. భక్తులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

# గురుకుల విద్యార్థులకు చేయూతగా కాకాని ఆశయ సాధన సమితి

నిర్భయవార్త ప్రతినిధి :విజయవాడ:గౌరవ ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 (పబ్లిక్--ప్రైవేట్--పీపుల్ పార్ట్‌నర్‌షిప్) కార్యక్రమంలో భాగంగా జి. కొండూరు మండలం, కుంటముక్కల డా. బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు అందించేందుకు కాకాని ఆశయ సాధన సమితి



సిద్ధం చేసిన పరుపులను కలెక్టర్ లక్ష్మీశ చేతులమీదుగా శనివారం విద్యార్థులకు అందజేశారు. సేవా భావంతో కాకాని ఆశయ సాధన సమితి అధ్యక్షులు డా. కాకాని తరుణ్ ముందుకు వచ్చి హాస్టల్ విద్యార్థులకు అవసరమైన పరుపులను అందించడం అభినందనీయమని ఈ సందర్భంగా కలెక్టర్ అన్నారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషిలో ఇలాంటి సంస్థలు భాగస్వాములు కావడం గర్వకారణమన్నారు. జిల్లాలో పీ4 కార్యక్రమం విజయవంతంగా అమలవుతోందని, మార్గదర్శులు.. బంగారు కుటుంబాలను అన్ని విధాలా ఎదిగేలా చేసేందుకు చేయూతనిస్తున్నారని పేర్కొన్నారు. పేదరిక నిర్మూలనలో సమాజంలోని ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కాకాని ఆశయ సాధన సమితి అధ్యక్షులు డా. కాకాని తరుణ్ మాట్లాడుతూ గౌరవ ప్రధానమంత్రి నరేంద్రమోదీగారు బాలికా విద్యపై ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తున్నారని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆశయాల సాధనలో ప్రతిఒక్కరం సామాజిక బాధ్యతగా భాగస్వాములు కావాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ లక్ష్మీశ విద్యార్థులతో ముచ్చటించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు.



# పసలూరు గ్రామంలో ఆర్డీఎస్ఎస్ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్.

అనంతపురం, నిర్భయవార్త ప్రతినిధి : బుక్కరాయసముద్రం మండలంలోని పసలూరు గ్రామంలో జరుగుతున్న ఆర్డీఎస్ఎస్ పథకం పనులను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పరిశీలించారు. శనివారం పసలూరులో జిల్లా కలెక్టర్ గ్రామస్థులతో మాట్లాడి ఆర్డీఎస్ఎస్ పథకం ద్వారా వారికి కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలు (Poles) మరియు డిటిఆర్ లను ఏర్పాటు చేసే సమయంలో ఏపీఎస్పీడిసిఎల్ అధికారులకు సహకరించాలని గ్రామస్థులకు సూచించారు. అదేవిధంగా పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా వినియోగదారులకు కలిగే ప్రయోజనాల గురించి వారికి అవగాహన కల్పించారు. శిర్డీసాయి ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులకు, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం తేదీకి అనుగుణంగా మిగిలిన పనులను







పూర్తి చేయడానికి అదనంగా కనీసం 90 బృందాలను (batches) ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీడిసిఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ శేషాద్రి శేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.వి.రమేష్ మరియు శ్రీకాంత్ రెడ్డి, ఏఈ మహబూబ్ భాష, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు బుక్కరాయసముద్రం మండలంలోని రేకులకుంట గ్రామంలో అంగన్ వాడి కేంద్రంను, ప్రైమరీ స్కూల్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్ వాడి కేంద్రంలో వయసుకు తగ్గ ఎత్తు, బరువు పిల్లలు ఉన్నారా లేదా అని పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం, మధ్యాహ్న భోజనం అందజేస్తున్నారా అంటూ ఆరా తీశారు. ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు మంచి భోదన అందజేయాలన్నారు.

# విజయవాడ వైసీపీ పశ్చిమ నియోజకవర్గ పరిశీలకులుగా ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా నియామకం.

విజయవాడ నిర్భయవార్త ప్రతినిధి :మాజీ సీఎం జగన్ కి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్



రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిశీలకులుగా నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా మాట్లాడుతూ విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులగా తనను నియమించిన మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడలో పశ్చిమ నియోజకవర్గములో మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాస్ రావుతో కలిసి వైసీపీ పార్టీ క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. పశ్చిమ నియోజకవర్గం లోని వైసీపీ నేతలని, కార్యకర్తలని ఏకతాటిపైకి తీసుకువస్తామని తెలిపారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో బలంగా ఉందని చెప్పడం ఏమాత్రం అతిశయోక్తి కాదన్నారు. ఈ సందర్భంగా ఆయన మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయం లాభసాటి సాగుకు మార్గం: మంత్రి సవిత







విజయవాడ, నిర్భయవార్త ప్రతినిధి :వ్యవసాయం లాభసాటిగా మారాలంటే రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత అన్నారు. ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని ఫార్చ్యూన్ మురళి పార్క్ హోటల్‌లో ఆర్థికంగా బలహీన వర్గాల రైతుల కోసం ప్రకృతి వ్యవసాయ విధానం పై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆమె పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన రైతులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొని ప్రకృతి వ్యవసాయం పద్ధతులపై నిపుణులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వర్గాలను బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఒకవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే మరోవైపు స్వయం సమృద్ధి సాధించేందుకు ఇటువంటి కార్యక్రమాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. దేశంలో అత్యధిక మందికి వ్యవసాయమే జీవనాధారమని పేర్కొంటూ, ప్రస్తుతం ఎరువులు, పురుగు మందుల ఖర్చులు విపరీతంగా పెరిగి రైతులకు భారం అవుతున్నాయని తెలిపారు. రసాయనాలపై ఆధారపడకుండా సహజ వనరులతో వ్యవసాయాన్ని కొనసాగిస్తే రైతులకు ఖర్చు తగ్గి లాభాలు పెరుగుతాయని చెప్పారు. జీవామృతం, ఘనజీవామృతం వంటి సహజ వనరులతో పంటలు పండించవచ్చని, సహజ పద్ధతులతో సాగు చేయడం వల్ల నేల సారం కూడా పెరుగుతుందని మంత్రి వివరించారు. ప్రస్తుతం ప్రజల ఆహారపు అలవాట్లు మారుతున్నాయని, ఆర్గానిక్ ఉత్పత్తులకు మార్కెట్లో మంచి డిమాండ్, అధిక ధర లభిస్తున్నాయని చెప్పారు. ఆర్గానిక్ ఆహారం తీసుకోవడం వల్ల ప్రాణాంతక వ్యాధులకు దూరంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన రైతులు ప్రకృతి సాగుపై దృష్టి సారించి అధిక లాభాలు సాధించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. సునీత మాట్లాడుతూ, ఆర్థికంగా బలహీన వర్గాల రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించేందుకు ప్రకృతి వ్యవసాయం వంటి పద్ధతులను ప్రోత్సహించడం అవసరమని చెప్పారు. సహజ వ్యవసాయం ద్వారా సాగు ఖర్చులు తగ్గడంతో పాటు ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. మాజీ ఐఏఎస్ అధికారి పి.వి. విజయ్ కుమార్ ఆన్‌లైన్ ద్వారా కార్యక్రమంలో పాల్గొని ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. భవిష్యత్ తరాల కోసం నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే సహజ వ్యవసాయ పద్ధతులను రైతులు క్రమంగా అవలంబించాలని సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లలో సేంద్రీయ ఎరువులతో సాగు చేసిన కూరగాయలు, అపరాలు మరియు ఇతర వ్యవసాయ ఉత్పత్తులను మంత్రి సవిత పరిశీలించారు. పంటల ఉత్పత్తిలో ఏయే సేంద్రీయ ఎరువులు ఉపయోగించారో రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం చేపట్టి ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను అందిస్తున్నందుకు రైతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రామ్ ప్రసాద్, ఆర్యవైశ్య, క్షత్రియ కార్పొరేషన్ల ఎండీ ఎం. మహేశ్వర్ రెడ్డి, కమ్మ, రెడ్డి, ఈబీసీ కార్పొరేషన్ల ఎండీ జి. భీమశంకర్ రావు, బ్రాహ్మణ కార్పొరేషన్ ఎండీ చిన్నబాబు, రైతు సాధికార సంస్థ ప్రతినిధులు గోపిచందు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



# దివంగత నేత వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి


## మా మిత్రమండలి నిర్వాహకులు చింతల రామారావు (బాబి), చెన్నుపాటి శ్రీనివాస్, చింతల రవికుమార్ (చంటి)

విజయవాడ నిర్భయవార్త ప్రతినిధి :విజయవాడ బస్టాండ్ వద్ద నున్న కూడలిలోని పార్క్ లో దివంగత నేత వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మా మిత్రమండలి నిర్వాహకులు చింతల రామారావు (బాబి), చెన్నుపాటి శ్రీనివాస్, చింతల రవికుమార్ (చంటి) కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ క్రమంలో భాగంగా ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు ఇస్తూ వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఏర్పాటు కోసం నిర్విరామంగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా నేడు మా మిత్రమండలి సభ్యులు బృందం ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా కి, ఎన్టీఆర్ జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ కు, జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ జమ్మల పూర్ణమ్మకి, కార్పొరేటర్లు బండి పుణ్యశీలకి, బుల్లా విజయ్ కుమార్ కు, వైసీపీ నేతలు పోతిన మహేష్ కి, గుండె సుందర్ పాల్ కి వినతి పత్రాలు అందజేశారు. అనంతరం మా మిత్రమండలి నిర్వాహకులు చింతల రామారావు (బాబి), చెన్నుపాటి శ్రీనివాస్, చింతల రవికుమార్ (చంటి) మాట్లాడుతూ విజయవాడ నగరానికి కాకుండా ఉమ్మడి కృష్ణాజిల్లాకు నిస్వార్థంగా సేవలు అందించిన ప్రజా నాయకుడు వంగవీటి మోహనరంగాని కుల మతాలకతీతంగా ప్రజలు స్మరించుకుంటున్నారని తెలిపారు. కావున ఆయన విగ్రహాన్ని విజయవాడ నడిబొడున ఏర్పాటు చేయడానికి మా మిత్రమండలి సంస్థ కృషి చేస్తుందని స్పష్టం చేశారు. మా మిత్ర మండలి తరుపున రాజకీయాలక తీతంగా అందరి రాజకీయ నాయకులకు లిఖితపూర్వకంగా వినతి పత్రాలు అందించి వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సూచించినట్లు తెలిపారు.














# బౌలింగ్ పైనే.. భారం

## బుమ్రా మినహా అందరూ ఫెయిల్

- వరుణ్ బౌలింగ్‌లో మిస్టరీ మాయం
- అర్షదీప్‌లో తగ్గిన పదును
- నిలకడ లేని అక్షర్ పటేల్
- మెన్ బ్లూకి ఫైనల్ జట్టు టెన్షన్

టీ20 ప్రపంచకప్-2026లో డిఫెండింగ్ ఛాంపియన్ భారత జట్టు ఫైనల్లోకి ప్రవేశించిన విషయం తెలిసిందే. గురువారం వాంఖడే స్టేడియం లో ఇంగ్లండ్‌తో జరిగిన ఉత్కంఠ సెమీస్ పోరులో టీమిండియా 7 పరుగుల స్వల్ప తేడాతో గెలిచి గట్టె క్కింది. 253 పరుగుల భారీ స్కోరు చేసినా ఆ లక్ష్యాన్ని కాపాడుకోవడానికి భారత బౌలర్లు చెమటోడ్చాల్సి వచ్చింది. ఈ మ్యాచ్‌లో జస్ప్రీత్ బుమ్రా మినహా అందరూ ఘోరమైన ప్రదర్శనలు చేశారు. చివర్లో హార్దిక్ పాండ్య కాస్త కట్టుదిట్టంగా బౌలింగ్ చేశాడు. ఈ మ్యాచే కాకుండా అంతకుముందు జరిగిన సూపర్-8 ఆఖరి మ్యాచ్లోనూ భారత బౌలర్లు విండీస్ బ్యాటర్లను కట్టడి చేయడంలో విఫలమ య్యారు.

ఈ మ్యాచ్‌లోనూ సంజూ శాంసన్ వీరోచిత ఇన్నింగ్స్ కారణంగానే టీమిండియా గట్టెక్కింది. ఇక తాజాగా సెమీస్ లోనూ సంజూ సూపర్బ్ బ్యాటింగ్‌తో సూర్యసేన విజయాన్ని అందుకోగలి గింది. ఇంగ్లండ్‌పై టీమిండియా గెలిచి ఫైనల్ బెర్తు దక్కించుకుంది. కానీ, ఆ విజయం సంతృప్తి కరంగా అసలు లేనేలేదు. భారీ టార్గెట్‌ను కాపాడుకోవడానికి టీమిండియా బౌలర్లు చాలా శ్రమించాల్సి వచ్చింది. చివరి మూడు ఓవర్లలోనే మ్యాచ్ తారుమారైంది. లేదంటే ఫలితం వేరేలా ఉండేది. బుమ్రాను మినహా యిస్తే.. సరైన బౌలింగ్ ప్రత్యామ్నాయం కనిపించడం లేదు. కీలక సమయంలో ఎవరితో బౌలింగ్ చేయించా లో కెప్టెన్ సూర్యకు తోచడం లేదు. ఈ ప్రపంచకప్ స్పిన్నర్లు కూడా మ్యాజిక్ చేయలేక పోతున్నారు. మిస్టరీ స్పిన్నర్ గుర్తింపు తెచ్చుకున్న భారత స్టార్ స్పిన్నర్ వరుణ్ చక్ర వర్తి ఈ మెగా టోర్నీలో అట్టర్ ఫ్లాప్ అయ్యాడు. సెమీస్‌లో అయితే అతడి ప్రదర్శ మరింత ఘోరం. తన 4 ఓవర్ల కోటలో వరుణ్ ఏకంగా 64 పరుగులు సమర్పించుకున్నాడు. టీ20 ప్రపంచకప్ చరిత్రలో భారత్ తరఫున ఓ మ్యాచ్లో అత్యధిక పరుగులు ఇచ్చిన బౌలర్ వరుణ్ చక్రవర్తి చెత్త రికార్డును కూడా తన పేరిట లిఖించుకున్నాడు. ఈ క్రమంలోనే జోగిందర్ శర్మ (57 పరుగులు) రికార్డును తాజాగా వరుణ్ అధిగ మించాడు. ఈ మ్యాచ్‌లో ఫామ్ లేని జోస్ బట్లర్ను ఔట్ చేయడం తప్పితే అతడి బౌలింగ్‌లో ఏ ప్రత్యేకతా కనిపించలేదు.



### వరుణ్ బౌలింగ్‌పై ఇంగ్లండ్ బ్యాటర్ ఎదురు దాడి

జాకబ్ బెథెల్ ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగాడు. మరోవైపు వైస్ కెప్టెన్, ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ కూడా ఆకట్టుకోలేకపోతున్నాడు. టీ20 టాప్ క్లాస్ బౌలర్ పేరొందిన అర్షదీప్ సింగ్ కూడా ఈ ప్రపంచ కప్‌లో ఘోరంగా విఫలమవుతున్నాడు. ఇంగ్లండ్ మ్యాచ్‌లో పదే పదే వైడ్లు వేస్తూ ప్రత్యర్థి బ్యాటర్లకు కుదురుకునే అవకాశాలు కల్పించాడు. మొత్తంగా ఇంగ్లండ్‌తో జరిగిన సెమీస్ పోరులో బుమ్రా తప్ప అందరూ చేతులెత్తే శారనే చెప్పాలి. జట్టులో బుమ్రాతో పాటు ఇంకో నమ్మదగ్గ బౌలర్ లేకపోవడం భారత జట్టును బల హీనపరుస్తోంది. ఇక ఆదివారం జరిగే ఫైనల్లో భారత్ మరో కఠిన ప్రత్యర్థి న్యూజిలాండ్‌తో అమీతుమీ తేల్చు కోనుంది. ఇలాంటి ప్రదర్శనలతో కివీస్‌ను ఓడించి రెండోసారి విశ్వవిజేత గా నిలవాలంటే సమష్టి కృషి అవసరం. వరుసగా విఫలమవుతున్న వరుణ్ చక్రవర్తిపై వేటు వేసి కుల్దీప్ యాదవ్‌కు తుది జట్టులో అవకాశం ఇస్తే బాగుంటుంది. ఛాన్స్ ఉంటే మరో పేసర్‌గా హైద రాబాదీ స్టార్ మహ్మద్ సిరాజు కూడా ఆడిస్తే భారత బౌలింగ్ యూనిట్ పటిష్టంగా మారుతుంది. ఇక ఫైన ల్లోనైనా భారత బౌలర్లు బంతుల్లో పదును పెంచితే మూడో టీ20 టైటిల్ మన ఖాతాలో పడుతుంది..

### అభిషేక్ శర్మ ఆడటం పక్కా

అభిషేక్ శర్మ పేలవ ఫామ్ నేపథ్యంలో అతడు ఫైనల్ ఆడడంపై తాజాగా క్లారిటీ వచ్చింది. అభిషేక్ శర్మను పక్కకు పెట్టాలని అభిమానులందరూ డిమాండ్ చేస్తున్నారు. కానీ భారత జట్టు యాజమాన్యం మాత్రం డిఫరెంట్‌గా ఆలోచన చేస్తుంది. ఫైనల్ మ్యాచ్ లో కచ్చితంగా అభిషేక్ శర్మకు అవకాశం ఇచ్చేందుకు అడుగులు వేస్తున్నట్లు వెల్లడించింది. అభిషేక్ శర్మ కచ్చితంగా ఫైనల్ మ్యాచ్ లో క్లిక్ అవుతాడు అన్న నమ్మకంతో గంభీర్ గ్యాంగ్ ఉందని తెలిపింది. వరుస విజయాలతో దూసుకు వెళ్తున్న భారత జట్టులో మార్పులు చేస్తే ప్రమాదం పొంచి ఉండే ఛాన్స్ కూడా ఉంటుంది. ఇదే విషయాన్ని భారత యాజమాన్యం ఆలోచన చేస్తున్నట్లు పీటీఐ స్పష్టం చేసింది. అంటే ఈ లెక్కన ఫైనల్ మ్యాచ్ లో అభిషేక్ శర్మ ఆడతాడు అన్నమాట. మరి ఇంతలా అభిషేక్ శర్మకు అవకాశం ఇస్తున్న భారత జట్టు యాజమాన్యం.. నమ్మకం నిలుస్తుందో? లేదో చూడాలి. కానీ ఒక్కసారి అభిషేక్ శర్మ క్లిక్ అయితే మాత్రం.. ప్రత్యర్థికి నరకం కనిపిస్తుంది. ఈ విషయాన్ని కూడా అభిమానులు స్పష్టం చేస్తున్నారు. అటు సంజు శాంసన్ కూడా అభిషేక్ శర్మ క్లిక్ అవు తాడనే నమ్మకాన్ని కనబరిచారు. కాగా మార్చి 8వ తేదీన భారత్, న్యూజిలాండ్ మధ్య ఫైనల్ మ్యాచ్ ఉంటుంది.

# గద్దర్ అవార్డ్స

- ఉత్తమ చిత్రంగా 'రాజు వెడ్స్ రాంబాయి'
- చిరంజీవికి 'ఎన్టీఆర్ నేషనల్' అవార్డ్
- కమల్ హాసన్‌కు 'పైడి జయరాజ్' పురస్కారం
- మార్చి 19న ఉగాది రోజున అవార్డుల ప్రదానం







## ఉత్తమ నటీనటులుగా నాగచైత్య, రష్మిక మందన్న



గద్దర్ అవార్డుల ప్రకటన వచ్చింది. 2025 ఏడాదిలో విడుదలైన చిత్రాలకు సంబంధించిన అవార్డులను తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మెన్ దిల్ రాజు ప్రకటించారు. ఇందులో చిరంజీవి, కమల్ హాసన్, జయసుధ, ఆర్ నారాయణమూర్తి, అశ్వినీదత్, రమేష్ ప్రసాద్, సుద్దాల అశోక్ తేజలకు ప్రత్యేక అవార్డులు వరించాయి. ఎన్టీఆర్ అవార్డుకి చిరంజీవిని ఎంపిక చేవారు. అలగే పైడి జయరాజ్ అవార్డు కమల్ హాసన్‌కు దక్కింది. అక్కినేని అవార్డుకి జయసుధని ఎంపిక చేయడ విశేషం. ఇక నాగిరెడ్డి చక్రపాణి అవార్డు నిర్మాత అశ్వనీదత్‌కి వరించగా, సినారె అవార్డు సుద్దాల అశోక్ తేజకి, రఘుపతి వెంకయ్య అవార్డు రమేష్ ప్రసాద్‌కి, కాంతారావు అవార్డుకి ఆర్ నారాయణమూర్తిని ఎంపిక చేశారు. బీఎన్ రెడ్డి ఫిల్మ్ అవార్డుకి సింగీతం శ్రీనివాస రావుని ఎంపిక చేయడం విశేషం. తెలుగు సినిమా అభివృద్ధికి దోహదపడ్డ మన సినీ దిగ్గజాల పేరుతో అవార్డులను ప్రకటించారు. ఈ సారి కొత్తగా వీటిని ప్రకటించారు.







## నటీనటుల జాబితా ఇదే

ఉత్తమ నటుడు – నాగ చైతన్య (తండేల్)
ఉత్తమ నటి – రష్మిక మందన్న (ది గర్ల్ ఫ్రెండ్)
ఉత్తమ చిత్రం – రాజు వెడ్స్ రాంబాయి
ఉత్తమ ద్వితీయ చిత్రం – దండోరా
ఉత్తమ తృతీయ చిత్రం – ది ప్రీ వెడ్డింగ్ షో
నేషనల్ ఇంటిగ్రిటీ సినిమా – తండేల్
ఉత్తమ పర్యావరణ చిత్రం – ఇగ్వా
ఉత్తమ డెబ్యూ ఫీచర్ ఫిల్మ్ – లిటిల్ హార్ట్స్
ఉత్తమ వినోదాత్మక చిత్రం – సంక్రాంతికి వస్తున్నాం
ఉత్తమ సోషల్ మెసేజ్ చిత్రం – కోర్టు
ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్స్ మూవీ – మిరాయ్
ఉత్తమ బాలల చిత్రం – అనగనగనా
ఉత్తమ దర్శకుడు – సాయిలు (రాజు వెడ్స్ రాంబాయి)
ఉత్తమ సపోర్టింగ్ నటుడు – శివాజీ
ఉత్తమ సపోర్టింగ్ నటి- భూమిక
ఉత్తమ సంగీత దర్శకుడు – మార్క్ కె రాబిన్ (దండోరా)
ఉత్తమ నేపథ్య గాయకుడు – అనురాగ్ (రాజు వెడ్స్ రాంబాయి)
ఉత్తమ నేపథ్య గాయని – సాహితి చాగంటి (కన్నప్ప)
ఉత్తమ హాస్యనటుడు – కృష్ణ తేజ (జిగ్రీస్)
ఉత్తమ బాలనటుడు – రోహన్ రాయ్ (ప్రీ వెడ్డింగ్ షో)
ఉత్తమ కథా రచయిత – గుణశేఖర్ (యుఫోరియా)



ఉత్తమ స్క్రీన్ ప్లే రైటర్ – అనిల్ రావిపూడి
ఉత్తమ గేయ రచయిత – నందకిశోర్ (కుబేర)
ఉత్తమ సినిమాటోగ్రాఫర్ – కార్తిక్ ఘట్టమనేని (మిరాయ్)
ఉత్తమ ఎడిటర్- శ్రీకర్ ప్రసాద్ (మిరాయ్)
ఉత్తమ ఆడియోగ్రాఫర్ – ఎం.ఆర్ రాధాకృష్ణన్ కిష్కిందపురి
ఉత్తమ కొరియోగ్రాఫర్ – గిర గిర గిర
ఉత్తమ ఆర్ట్ డైరక్టర్ – తోట తరణి ఛాంపియన్
ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్ – గోవింద్ అఖండ
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్ – చాంపియన్ – చంద్రకాంత్
ఉత్తమ స్పెషల్ జ్యూరీ ఫిల్మ్ – 23
ఉత్తమ మేల్ యాక్టర్ – చైతూ జొన్నలగడ్డ (రాజు వెడ్స్ రాంబాయి)
ఉత్తమ నటి – అనంతిక (8 వసంతాలు)
స్పెషల్ జ్యూరీ హీరో – రోషన్ (చాంపియన్)

Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197